ప్రశ్నించే హక్కే...

# జనసేన

/ www.janasenanews.in

తెలుగు వార్తా పత్రిక




ఆంధ్రప్రదేశ్ | అమరావతి | బుధవారం 25 ఫిబ్రవరి 2026 | సంపుటి : 14 | సంచిక : 41 | పేజీలు : 12 | వెల : రూ. 3/- | RNI NO : APTEL/2014/59326

Circulated at : Hyderabad, Guntur, Vijayawada, Prakasam, Anantapur, Nellore, YSR Kadapa, Visakhapatnam, East & West Godavari Districts.

## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

- దేవ్‌జీ, బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి
- డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి
- మావోయిస్టు నేతలు అజ్ఞాతం వీడటంతో ముగిసిన దండకారణ్య పోరు



హైదరాబాద్ జనసేన ప్రతినిధి

తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మావోయిస్టు అగ్రనేతలు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో అగ్రనేత దేవ్‌జీ, బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డిలు ఉన్నారు. లొంగిపోయిన నలుగురు మావోయిస్టులకు డీజీపీ రివార్డు చెక్కులను అందించారు. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి ప్రస్తుతం మావోయిస్టు పార్టీ సెక్రటరీగా ఉన్నారు. తిప్పిరి తిరుపతి జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన వ్యక్తి. కోరుట్లలో ప్రాథమిక విద్య, - మిగతా3లో



## రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ట్రేడ్ డీల్

- యుద్ధ నిర్ణయం రాజకీయమే కానీ సైనికులది కాదని వ్యాఖ్య
- ఇండో, యూఎస్ ట్రేడ్ ఒప్పందం రైతులకు వ్యతిరేకమని ఆరోపణ
- పార్లమెంట్‌ను పక్కన పెట్టి ట్రంప్‌తో మోదీ డీల్ చేశారంటూ విమర్శ
- లోక్‌సభలో మాట్లాడనివ్వలేదని ఆవేదన


2లో

# కల్తీ నెయ్యి మహాపాపం

వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో 20 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో చేశారు: సీఎం చంద్రబాబు

తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో లఘు చర్చ

'మహాపాపం' పేరిట గత ప్రభుత్వం లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన సీఎం చంద్రబాబు



అమరావతి జనసేన ప్రతినిధి

వైఎస్సార్సీపీ హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని సీఎం చంద్రబాబు తెలిపారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని అన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో సీఎం మాట్లాడుతూ 'మహాపాపం' పేరిట గత ప్రభుత్వం లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వైఎస్సార్సీపీ నేతలు ఒక లడ్డూ విషయంలోనే కాదు అనేక విషయాల్లో తప్పు చేశారని కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. 2019–24 మధ్యకాలంలో 20 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో చేశారని సీఎం అన్నారు. 59.71 లక్షల కేజీల కల్తీ నెయ్యి వినియోగించారని ఇంక రూ.234.51 కోట్ల నిధుల అక్రమాలు జరిగాయని వివరించారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ల్యాబ్‌లకు కన్నుకప్పి టెండర్లు దక్కించుకున్నారని వెల్లడించారు. - మిగతా3లో



## చైనా జే-20కి చెక్...

- రష్యా మోడ్రన్ స్టెల్త్ విమానాల వైపు భారత్ చూపు!
- ఐదో తరం స్టెల్త్ విమానాల కోసం భారత్ ప్రయత్నాలు!
- రష్యా సుఖోయ్ సూ–57 ఫైటర్ జెట్లపై భారత వాయుసేన ఆసక్తి
- ఆపరేషన్ సిందూర్ తర్వాత స్టెల్త్ టెక్నాలజీ ప్రాముఖ్యత గుర్తింపు
- చైనా జే-20కి పోటీగా వాయుసేనను ఆధునికీకరించే ప్రణాళిక
- స్వదేశీ ఏఎంసీఏ ప్రాజెక్ట్ ఆలస్యం కావడంతో మధ్యంతర పరిష్కారంగా పరిశీలన
- దాదాపు 40 విమానాల కొనుగోలుకు చర్చలు!

2లో



## కేరళమ్‌గా కేరళ రాష్ట్రం పేరు

- కేరళ పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం
- కేరళ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

2

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం



ఏపీ క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం


ధృవీకరణ పత్రాలున్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్

విశాఖలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం

రాష్ట్రవ్యాప్తంగా పలు పర్యాటక, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు పచ్చజెండా

అమరావతి జనసేన ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్' పేరిట కొత్త శాఖను ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాలనా సౌలభ్యం పెంచి, అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 55 అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో ముఖ్యంగా, ధృవీకరణ పత్రాలు కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపే క్రమంలో విశాఖపట్నంలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అదేవిధంగా, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, చీరాల, తిరుపతి, సత్యసాయి జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులతో పాటు సౌర, పవన, హైబ్రిడ్ ఇంధన ప్రాజెక్టులకు కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పెట్టుబడుల - మిగతా3లో



## ఏటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యల పరిష్కారంపై శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన మంత్రి లోకేశ్

కూటమి అధికారంలోకి వచ్చాక పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని వెల్లడి

అమరావతి జనసేన ప్రతినిధి

జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి అధ్యాపకుల నియామకాలను యుద్ధ ప్రాతిపదికన చేపడతామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రైవేటు రంగానికి ధీటుగా ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలు తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ మేరకు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యల పరిష్కారంపై శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్ కళాశాలల డేటా నమోదు చేయలేదన్న లోకేశ్ - మిగతా3లో



## అమెరికా అతిపెద్ద యుద్ధనౌకలో వింత కష్టాలు

- ఇరాన్‌తో ఉద్రిక్తతల నడుమ టాయిలెట్లతో తిప్పలు!
- అమెరికా యుద్ధనౌక జెరాల్డ్ ఫోర్డ్‌లో సమస్యలు
- నౌకలోని టాయిలెట్లు, మురుగునీటి వ్యవస్థ తరచూ విఫలం

2



## జయలలిత జయంతికి గుడ్‌న్యూస్

- కొత్త పార్టీపై శశికళ పరోక్ష సంకేతాలు
- తమిళనాడు మాజీ సీఎం జయలలిత 78వ జయంతి వేడుకలు
- తన స్నేహితురాలు జయలలితకు నివాళులర్పించిన శశికళ
- ఈ క్రమంలో కీలక వ్యాఖ్యలు

2

## అమెరికా అతిపెద్ద యుద్ధనౌకలో వింత కష్టాలు...



మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ, అమెరికా తన సైనిక శక్తిని పెద్ద ఎత్తున మోహరిస్తోంది. అయితే, ఈ కీలక సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత ఖరీదైన విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఊహించని సమస్యలతో సతమతమవుతోంది. యుద్ధ సన్నాహాల కంటే ఎక్కువగా.. నౌకలోని మరుగుదొడ్ల వ్యవస్థ విఫలమవడం సుమారు 5,000 మంది సిబ్బందికి నరకం చూపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో, మధ్యప్రాచ్యంలో సైనిక శక్తిని ప్రదర్శించేందుకు ఈ నౌకను రంగంలోకి దించారు. గత ఏడాది జూన్‌లో సముద్రంలోకి వచ్చిన ఈ నౌక మోహరింపును ఇప్పటికే రెండుసార్లు పొడిగించారు. దీంతో సిబ్బంది దాదాపు 8 నెలలుగా సముద్రంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణంగా శాంతికాలంలో ఆరు నెలలకు మించి డెప్లాయ్‌మెంట్ (మోహరింపు) ఉండదు. ఇది మరో 11 నెలల వరకు కొనసాగితే, అమెరికా నేవీ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన నిరంతర డెప్లాయ్‌మెంట్‌గా రికార్డు సృష్టిస్తుందని రిటైర్డ్ రియర్ అడ్మిరల్ మార్క్ మాంట్‌గోమరీ వాల్ స్ట్రీట్ జర్నల్‌కు తెలిపారు. సుమారు 13 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.1 లక్షల కోట్లు) భారీ వ్యయంతో నిర్మించిన ఈ నౌకలో ఏర్పాటు చేసిన వాక్యూమ్ ఆధారిత ప్లంబింగ్ వ్యవస్థ ప్రధాన సమస్యగా మారింది. ఇందులో దాదాపు 650 టాయిలెట్లు ఉన్నాయి. ఏదైనా ఒక టాయిలెట్‌లో సమస్య వస్తే, ఆ సెక్షన్‌లోని అన్ని టాయిలెట్లు పనిచేయకుండా పోతున్నాయి. టీ-షర్టులు, తాళ్లు వంటి వస్తువులు పైపుల్లో ఇరుక్కుపోవడం, కొన్నిసార్లు టాయిలెట్ విడిభాగాలు ఊడిపోవడం వంటి కారణాలతో ఈ వ్యవస్థ తరచూ మొరాయిస్తోంది. జనవరిలో ఎన్‌పీఆర్ రిపోర్ట్ ప్రకారం, ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యాయని తెలుస్తోంది. ఈ సాంకేతిక సమస్యల పరిష్కారానికి నావికా సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. లీక్‌లను అరికట్టేందుకు కొందరు సిబ్బంది రోజుకు 19 గంటల వరకు పనిచేస్తున్నట్లు సమాచారం. డెప్లాయ్‌మెంట్ గడువును పదేపదే పొడిగించడంతో సిబ్బంది శారీరకంగా, మానసికంగా తీవ్ర అలసటకు గురవుతున్నారు. నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండటం వారిని మరింత కుంగదీస్తోంది. నౌక కదలికలను రహస్యంగా ఉంచే 'ఘోస్ట్ మోడ్' కారణంగా బయటి ప్రపంచంతో సంప్రదింపులు కూడా పరిమితమయ్యాయి. ఈ ఒత్తిడితో విసిగిపోయిన కొందరు నావికులు, ఈ డ్యూటీ ముగిసిన వెంటనే నేవీని విడిచిపెట్టాలని భావిస్తున్నట్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌తో పాటు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరడంతో రెండు విమాన వాహక నౌకలు మోహరించినట్లు అయింది. ఈ అంతర్గత సమస్యలు సిబ్బంది నైతిక స్థైర్యంపై ప్రభావం చూపుతున్నప్పటికీ, నౌక యుద్ధ సామర్థ్యంపై ఎలాంటి ప్రభావం లేదని అధికారులు చెబుతున్నారు.

## 'జయలలిత జయంతికి గుడ్‌న్యూస్'



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి వేళ ఆమె స్నేహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ కీలక ప్రకటన చేశారు. జయలలిత జయంతి వేడుకలకు ముందు శుభవార్త వస్తుందని వ్యాఖ్యానించారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన నేపథ్యంలో శశికళ కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శశికళ తాజాగా చేసిన వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. జయలలితకు నివాళులర్పించిన అనంతరం శశికళ చేసిన వ్యాఖ్యలు తాను కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నానని ఆమె పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్లు అయ్యింది. ఫిబ్రవరి 24 (మంగళవారం) తమిళనాడు మాజీ సీఎం జయలలిత జయంతి. ఈ క్రమంలో శశికళ అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎంజీ రామచంద్రన్, జయలలిత స్మారక మందిరాల వద్ద పుష్పగుచ్చాలు పెట్టి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తన రాజకీయ అరంగేట్రం గురించి శశికళ పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. "ఈ రోజు అమ్మ (జయలలిత) పుట్టినరోజు సందర్భంగా ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆ కార్యక్రమంలో శుభవార్త వస్తుంది. " అని వ్యాఖ్యానించారు.

### పార్టీ నుంచి సస్పెండ్

మాజీ సీఎం జయలలిత 2016 డిసెంబర్‌లో మరణించడంతో, అప్పట్లో ఆమె నెచ్చెలి శశికళ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. అంతలోనే శశికళ అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లారు. దీంతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాగా, తమిళనాడులో మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి నెల ప్రారంభంలో శశికళ చెన్నైలో తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శశికళ సన్నిహితుడు అరసన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము చిన్నమ్మతోనే (శశికళ) ఉన్నామని, ఆమెకు అండగా నిలుస్తామని అరసన్ అన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో శశికళ ఏ నిర్ణయం తీసుకున్నా తాము అందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. తాను చిన్నప్పటి నుంచి వీకే శశికళ, ఆమె భర్త నటరాజన్‌కు చాలా నమ్మకమైన మద్దతుదారుడినని చెప్పారు. ఎప్పటికీ అలాగే కొనసాగుతానని స్పష్టం చేశారు. అయితే 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు శశికళ తన మద్దతుదారులతో సమావేశం అవ్వడం, ఇతర పరిస్థితులను బట్టి ఆమె కొత్త పార్టీ పెట్టనున్నారని వార్తలు వినిపించాయి. అందుకు తగ్గట్లుగానే జయలలిత జయంతి నాడు శశికళ పరోక్ష సంకేతాలు ఇచ్చారు.

### మోదీ, అమిత్ షా నివాళులు

మరోవైపు, జయలలిత 78వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్రహోం మంత్రి అమిత్ షా ఆమెకు నివాళులర్పించారు. జయలలిత సేవలను గుర్తు చేసుకున్నారు. తమిళనాడులో సంక్షేమ ఆధారిత పాలన, మహిళా సాధికారత, సమగ్రాభివృద్ధికి పాటుపడిన ఆకర్షణీయమైన నాయకురాలు, అత్యుత్తమ పాలనాదక్షత కలిగిన నేత జయలలిత అని మోదీ కొనియాడారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'జయలలితను ఆమె జయంతి సందర్భంగా స్మరించుకుంటున్నాం. ఆకర్షణీయ నాయకురాలిగా, అత్యుత్తమ పాలనాదక్షత కలిగిన నేతగా ఆమె ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. ఆమె జీవిత ప్రయాణం అపారమైన ధైర్యం, దృఢ సంకల్పంతో కూడుకున్నది. తమిళనాడు ముఖ్యమంత్రిగా మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధిపై బలమైన సంకల్పంతో సంక్షేమ ఆధారిత పాలనను ఆమె కొనసాగించారు." అని మోదీ పేర్కొన్నారు.

### 'పేదల సంక్షేమం, మహిళల హక్కుల కోసం జయలలిత కృషి చేశారు'

అలాగే కేంద్ర హోం మంత్రి అమిత్ సైతం జయలలితకు నివాళులర్పించారు. ఈ క్రమంలో తమిళనాడులోని పేదల సంక్షేమం, మహిళల సాధికారత కోసం జయలలిత చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. "తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ప్రజానాయకురాలు జె. జయలలిత జయంతి సందర్భంగా ఆమెకు నా హృదయపూర్వక నివాళులు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత కోసం ఆమె అంకితభావంతో కృషి చేశారు. తమిళనాడును అభివృద్ధి పథంలో నడిపించారు. ఆమె పరిపాలన ప్రయోజనాలు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా చేరేలా చూసుకున్నారు. ప్రజా సేవ పట్ల ఆమె నిబద్ధత ఎప్పటికీ అందరికీ ప్రేరణగా ఉంటుంది." అని అమిత్ షా ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# కేరళమ్‌గా కేరళ రాష్ట్రం పేరు

కేరళ రాష్ట్రం పేరును 'కేరళమ్'గా మార్చాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి మండలి మంగళవారం ఆమోదం తెలిపింది. నూతన పీఎంఓ కాంప్లెక్స్ 'సేవా తీర్థ్'లో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

'కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన తరువాత, భారత రాష్ట్రపతి 'కేరళ పేరు మార్పు బిల్లు, 2026'ను కేరళ రాష్ట్ర శాసనసభకు పంపిస్తారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం, కేరళ రాష్ట్రం తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు ఈ ప్రక్రియను చేపడతారు. కేరళ శాసనసభ అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాత, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి సిఫారసుతో పార్లమెంట్?లో కేరళ పేరు మార్పు బిల్లు- 2026ను ప్రవేశపెడుతుంది' అని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

వాస్తవానికి కేరళ పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ 2024 జూన్ 24న కేరళ శాసనసభ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. "మలయాళం భాషలో రాష్ట్రం పేరు 'కేరళం'. 1956 నవంబర్ 1న భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ్డాయి. కేరళ పిరవి దినం కూడా నవంబర్ 1నే జరుగుతుంది. వాస్తవానికి స్వాతంత్ర్య పోరాట కాలం నుంచే మలయాళం మాట్లాడే వారందరికీ కలిపి 'ఐక్య కేరళం' కావాలనే డిమాండ్ బలంగా ఉండేది. అయితే రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్?లో మాత్రం 'కేరళ' అని నమోదు చేశారు. అందుకే ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం" అని 2024లో చేసిన ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

### రాష్ట్రాల పేర్లు ఇలా మార్చవచ్చా?

రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, ఇప్పటికే ఉన్న రాష్ట్రాల పేర్లను మార్చే అధికారం పార్లమెంట్?కు ఉంటుంది. అయితే



ఇలాంటి బిల్లును రాష్ట్రపతి సిఫారసు లేకుండా పార్లమెంట్?లో ప్రవేశపెట్టడానికి వీల్లేదు. అంతేకాదు సంబంధిత రాష్ట్ర శాసనసభకు ఆ బిల్లును పంపి నిర్ణీత సమయంలోగా అభిప్రాయాలను కోరాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే కేరళ రాష్ట్రం పేరు మార్పు అంశాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిశీలించింది. కేంద్ర హోం మంత్రి అమిత్? షా ఆమోదంతో డ్రాఫ్ట్ కేబినెట్ నోట్?ను న్యాయవ్యవహారాల శాఖ, శాసన సభ విభాగాలకు, న్యాయమంత్రిత్వ శాఖలకు పంపారు. వారు కూడా ఈ ప్రతిపాదనకు తమ సమ్మతిని తెలియజేశారు.

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మంగళవారం కేంద్ర కేబినెట్ కేరళ పేరు మార్పుతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా బాలికలందరికీ ఉచితంగా హెచ్?పీవీ వ్యాక్సినేషన్ చేయించాలని తీర్మానించింది. అలాగే 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్దాసిల్ ఇంజెక్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. మరోవైపు శ్రీనగర్?లో రూ.1667 కోట్లతో ఎయిర్?పోర్ట్ నిర్మాణానికి, రూ.1667 కోట్లతో అహ్మదాబాద్ మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపింది. అలాగే విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించింది.

### కేరళన్, కేరళైట్ పదాల మాటేమిటి?

కేరళ పేరును కేరళంగా మార్చడంపై కాంగ్రెస్ నేత శశిథరూర్ తనదైన రీతిపై స్పందించారు. రాష్ట్రం పేరును మారిస్తే అక్కడి ప్రజలను పిలిచే 'కేరళైట్?', 'కేరళన్?' లాంటి పదాల పరిస్థితి ఏమిటని సరదాగా ప్రశ్నించారు. 'కేరళం' వాసులను ఇకపై ఏమని పిలవాలి? అని చమత్కరించారు. వాస్తవానికి దీనిని కేబినెట్ నిర్ణయానికి ముందే ఎక్స్? వేదికగా ఆయన ఓ పోస్టు పెట్టారు. "ఇదంతా మంచిదే. కానీ ఇంగ్లీష్? మాట్లాడే మనలాంటి వారికి కోసం, భాషకు సంబంధించిన ఓ ప్రశ్న వేస్తాను. కేరళ ప్రజలను 'కేరళైట్'?, 'కేరళన్'? అనే పదాలతో పిలుస్తారు. రాష్ట్రం పేరును కేరళం అని మారిస్తే, అప్పుడు అక్కడి ప్రజలను 'కేరళమైట్' అంటారు. ఇదోదే సూక్ష్మజీవి పేరులా ఉంది. ఇక 'కేరళమియన్?' అంటే ఏదో అరుదైన ఖనిజం పేరులా అనిపిస్తోంది. ఈ పేరు మార్పు వల్ల పుట్టుకొచ్చే కొత్త పదాల కోసం కేరళ ముఖ్యమంత్రి ఓ పోటీని నిర్వహించాలేమో!"

### రాజాజీ విగ్రహం ఏర్పాటుపై హర్షం

మరోవైపు సోమవారం రాత్రి శశిథరూర్?, రాష్ట్రపతి భవన్?లో సి.రాజగోపాలాచారి (రాజాజీ) విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. భారత్ గణతంత్ర రాజ్యంగా మారకముందు, (రాష్ట్రపతి పదవి ఏర్పడక ముందు) గవర్నర్ జనరల్‌గా పనిచేసిన ఏకైక భారతీయుడు రాజాజీ అని ఆయన గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే ఆయన స్వతంత్ర పార్టీ సిద్ధాంతాలకు తాను బలమైన మద్దతుదారు డనని చెప్పారు. ప్రభుత్వ జోక్యం వంటగది, పడకగది, గ్రంథాలయాల వరకు ఉండకూడదనే ఆయన దృఢమైన భావాలను శశిథరూర్ కొనియాడారు. నేడు ఆయనను అనుసరించేవారు తక్కువ మంది ఉండడం విచారకరమని వ్యాఖ్యానించారు.

# రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ట్రేడ్ డీల్

యుద్ధ నిర్ణయాల నుంచి అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వరకు అన్ని అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భద్రత, రైతుల ప్రయోజనాలు, పార్లమెంటరీ వ్యవస్థ అన్నీ ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా జరిగిన రైతు మహాచౌపాల్ సభలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.

### ప్రధాని స్పందించలేదు: రాహుల్

మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలోని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన రాహుల్, చైనా ట్యాంకులు సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు ఆదేశాల కోసం రక్షణ మంత్రికి ఫోన్ చేసినా స్పందన రాలేదని నరవణే రాశారని చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఎవరూ స్పందించలేదని ఆయన పేర్కొన్నారని తెలిపారు. చివరికి యుద్ధ నిర్ణయం ప్రధాని తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రధాని స్పందించలేదని, ఆర్మీ చీఫ్‌ను ఒంటరిగా వదిలేశారని రాహుల్ వ్యాఖ్యానించారు. యుద్ధం చేయాలా వద్దా అన్నది రాజకీయ నిర్ణయమని, అది సైన్యానికి మోపలేమని స్పష్టం చేశారు.

### వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా అమెరికాతో ఒప్పందం!

ఇక ఇండో-- యూఎస్ ట్రేడ్ ఒప్పందంపై కూడా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉందని చెప్పారు. ఐదు నెలల పాటు



వ్యవసాయ ఉత్పత్తుల అంశం కారణంగా ఈ ఒప్పందం నిలిచిపోయిందని, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వం కూడా అంగీకరించలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ నుంచి బయటకు వెళ్లి నేరుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్?కు ఫోన్ చేసి ఒప్పందానికి సిద్ధమని చెప్పారని ఆరోపించారు.

### ఎప్‌స్టీన్ ఫైళ్ల వెనుక అనుమానాలు

"నాలుగు నెలలు ఏమీ జరగలేదు. ఒక్కసారిగా ప్రధాని కాల్ చేసి రైతులను అమ్మేశారు. గార్మెంట్ రంగాన్ని కూడా నష్టపరిచారు. దేశ డేటాను అమెరికాకు అప్పగించారు" అంటూ విమర్శించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రధానికి సవాల్ విసిరారు. అమెరికాలో ఎప్?స్టీన్? కేసుకు సంబంధించిన లక్షల ఫైళ్లు ఉన్నాయని, అవి వెలుగులోకి రాకపోవడం వెనుక కూడా అనేక అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా అదానీ పేరే వినిపిస్తోందని, ఆ సంస్థ కేవలం కంపెనీ కాదని, బీజేపీ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా మారిందని ఆరోపించారు. "అమెరికా సుప్రీం కోర్టు నిర్ణయం తర్వాత ఇతర దేశాలు యూఎస్?తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని నిర్ణయించు కున్నాయి. కానీ ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఈ వేదిక నుంచి నేను మోదీని సవాలు చేస్తున్నా. అమెరికా సుప్రీంకోర్టు ఈ ఒప్పందంపై తీర్పు ఇచ్చిన తర్వాత, అమెరికాతో ఒప్పందాన్ని రద్దు చేయండి. ట్రంప్ ఒత్తిడి కారణంగా ఆయన ఒప్పందాన్ని రద్దు చేయలేరు. భారత్?లో అత్యధిక జనాభా, అత్యధిక డేటా ఉంది. కానీ ప్రధాని మోదీ మన డేటా మొత్తాన్ని అమెరికాకు ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి లేకపోతే, ఆయన ఇలా చేసి ఉండేవారు కాదు. తన ఇమేజ్‌ను, రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి ఆయన భారతదేశాన్ని అమ్మేశారు" అని రాహుల్ ఆరోపించారు.

### ప్రజలతో కలిసి పోరాటం

పార్లమెంటరీ వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది తొలిసారి లోక్‌సభ ప్రతిపక్ష నేతకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని తెలిపారు. లోక్‌సభ లో ప్రసంగం ప్రారంభించగానే అడ్డుకున్నారని, తన మాట వినిపించనివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలు, జాతీయ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ అంశాల్లో కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు ముందుకు రావొద్దని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

# చైనా జే-20కి చెక్...

భారత వాయుసేన (ఐఏఎఫ్) తన సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకునే దిశగా కీలక యోచనలు చేస్తోంది. ఇటీవలే జరిగిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ 'సుఖోయ్ ఎస్‌యూ-57' కొనుగోలుపై రక్షణ వర్గాల్లో చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. చైనా, పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ అత్యాధునిక యుద్ధ విమానాలను సమకూర్చుకోవాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, వాయుసేన సుమారు 40 ఎస్‌యూ-57 జెట్లను ఆర్డర్ చేసే అవకాశం ఉందని సమాచారం. గత ఏడాది పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ వాయుసేనతో జరిగిన గగనతల పోరాటాలు భారత రక్షణ వ్యూహకర్తలకు కొత్త పాఠాలు నేర్పాయి. ఆధునిక యుద్ధ తంత్రంలో ఫైటర్ జెట్లు నేరుగా తలపడే డాగ్‌ఫైట్ కన్నా, శత్రువు కంటపడకుండా దాడి చేసే స్టెల్త్ టెక్నాలజీకే ప్రాధాన్యత పెరిగిందని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో, రాడార్లకు చిక్కని ఐదో తరం యుద్ధ విమానాల ఆవశ్యకతను ఐఏఎఫ్ గుర్తించింది. ఇప్పటికే చైనా జే-20 పేరుతో సొంతంగా స్టెల్త్ ఫైటర్‌ను అభివృద్ధి చేసింది. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ పాకిస్థాన్‌కు కూడా అందే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో, భారత్ వేగంగా స్పందించాల్సిన అవసరం ఏర్పడింది.

### ఎస్‌యూ-57 ప్రత్యేకతలు ఏంటి?

రష్యా అభివృద్ధి చేసిన ఎస్‌యూ-57 ఒక శక్తివంతమైన ఐదో తరం మల్టీరోల్ స్టెల్త్ ఫైటర్. శత్రు రాడార్లను ఏమార్చేలా ప్రత్యేకమైన ఏర్‌ఫ్రేమ్ డిజైన్, రాడార్ తరంగాలను శోషించుకునే మెటీరియల్స్‌తో దీనిని నిర్మించారు. సూపర్‌క్రూయిజ్



సామర్థ్యం (ఆఫ్టర్‌బర్నర్ అవసరం లేకుండానే సూపర్‌సానిక్ వేగంతో ప్రయాణించడం), అడ్వాన్స్‌డ్ సెన్సార్ ఫ్యూజన్ వంటి అత్యాధునిక ఫీచర్లు ఇందులో ఉన్నాయి. గగనతలం నుంచి గగనతలానికి, భూమిపైకి క్షిపణులను ప్రయోగించే సత్తా దీని సొంతం.

### మధ్యంతర పరిష్కారంగానే..

భారత్ సొంతంగా 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' (ఏఎంసీఏ) పేరుతో ఐదో తరం ఫైటర్ జెట్‌ను అభివృద్ధి చేస్తోంది. అయితే దీని తొలి ప్రయోగాత్మక ఫ్లైట్ 2028-29లో జరిగి, 2035 నాటికి గానీ వాయుసేనలోకి పూర్తిస్థాయిలో చేరే అవకాశం లేదు. ఈ సుదీర్ఘ కాలంలో ఏర్పడే వ్యూహాత్మక అంతరాన్ని పూడ్చడానికే ఎస్‌యూ-57 జెట్లను ఒక 'బ్రిడ్జింగ్' పరిష్కారంగా భారత్ చూస్తోంది. గత ఏడాది జరిగిన ఏరో ఇండియా 2025లో రష్యా ఈ విమానాన్ని ప్రదర్శనకు ఉంచింది. అయితే, ప్రస్తుతానికి ఈ కొనుగోలుపై ఎలాంటి అధికారిక ఒప్పందం జరగలేదని, కేవలం చర్చల దశలోనే ఉందని రక్షణ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# రాజకీయాలకు అతీతంగా లోకేశ్




**విజయవాడ :** ప్రస్తుత రాజకీయాల్లో పార్టీల మధ్య వైరం, విమర్శలు సర్వసాధారణం. కానీ, ప్రజాప్రతినిధి అంటే కేవలం తన పార్టీ వారికి మాత్రమే కాదని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలిచేవాడే నిజమైన నాయకుడని మంత్రి నారా లోకేష్ మరోసారి నిరూపించారు. రాజకీయ రంగులు చూడకుండా, మానవత్వమే పరమావధిగా ఆయన స్పందించిన తీరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీరాభిమాని, సోషల్ మీడియాలో ఆ పార్టీ తరపున చురుగ్గా ఉండే భాస్కర్ అనే యువకుడి తండ్రి ఇటీవల ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన తండ్రిని కాపాడుకోవడానికి భాస్కర్ తన వద్ద ఉన్న శక్తినంతా ధారపోశాడు. అయితే, వైద్య ఖర్చులు భారమవ్వడంతో ఆందోళన చెందిన అతను, నిస్సహాయ స్థితిలో తన పార్టీ అధినేత వైఎస్ జగన్‌తో పాటు మంత్రి నారా లోకేష్‌ను కూడా ట్యాగ్ చేస్తూ ఎక్స్ వేదికగా సాయం కోరాడు. భాస్కర్ ట్వీట్ చూసిన వెంటనే మంత్రి లోకేష్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించారు. అతను తనను గతంలో ఎంతగా విమర్శించాడు లేదా ఏ పార్టీకి చెందినవాడు అనే విషయాలను పక్కన పెట్టి, ఒక సాటి మనిషి ప్రాణం కాపాడటమే ముఖ్యం అని భావించారు. "మీ నాన్నగారికి జరిగిన ప్రమాదం గురించి విని బాధపడ్డాను భాస్కర్. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మా టీమ్ మిమ్మల్ని సంప్రదించి అవసరమైన సహాయం అందిస్తుంది" అంటూ భరోసా ఇచ్చారు. చెప్పినట్లుగానే లోకేష్ తన వ్యక్తిగత బృందాన్ని రంగంలోకి దింపారు. వెంటనే బాధితుడి కుటుంబాన్ని సంప్రదించి, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఒక వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు, టీడీపీ ప్రధాన కార్యదర్శి, మంత్రి స్థాయి వ్యక్తి స్వయంగా ఫోన్ చేయించి సాయం చేయడం రాజకీయ వర్గాల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ ఘటన నారా లోకేష్‌లోని పరిణతి చెందిన నాయకత్వ లక్షణాలను తెలియజేస్తోంది. ఎన్నికల సమయంలో విమర్శలు ఉండవచ్చు, కానీ కష్టం వచ్చినప్పుడు మాత్రం అందరూ ఒక్కటే అనే సంకేతాన్ని ఆయన ఇచ్చారు. ప్రభుత్వం అనేది అందరిది అని, ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉండటమే తమ ప్రాధాన్యత అని ఆయన నిరూపించారు. సోషల్ మీడియాలో దూషణలు చేసుకునే కార్యకర్తలకు, నాయకులు ఒకరికొకరు ఎలా గౌరవించుకుంటారో, ఎలా సాయం చేసుకుంటారో ఈ ఘటన ఒక కనువిప్పులా నిలిచింది. లోకేష్ చేసిన సహాయానికి భాస్కర్ చలించిపోయాడు. "థ్యాంక్యూ నారా లోకేష్ అన్నగారు.. పార్టీ చూడకుండా మా నాన్న గారి పరిస్థితిని చూసి ఒక అన్నలా సహాయం చేయడానికి ముందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు" అంటూ తిరిగి ట్వీట్ చేశాడు. ఆపద సమయంలో పార్టీ జెండాలు కాదు, మనిషికి మనిషి తోడవ్వడమే ముఖ్యమని అతను కూడా గ్రహించాడు. నారా లోకేష్ చేసిన ఈ చిన్న సాయం ఒక కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి కానీ ఇలాంటి మానవీయ విలువలే నాయకుడిని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలబెడతాయి. రాజకీయాల కంటే మానవత్వం గొప్పదని చాటిచెప్పిన లోకేష్ స్పందన నిజంగా అభినందనీయం. ఈ తరహా రాజకీయ సంస్కృతి రాష్ట్రంలో ఆరోగ్యకరమైన వాతావరణానికి నాంది పలుకుతుందని ఆశించవచ్చు=

# ఆ నాలుగు సీట్ల కోసం 40 మంది పోటీ



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి రాజ్యసభ వైపు మళ్లింది. వచ్చే జూన్ నెలలో ఖాళీ కాబోతున్న నాలుగు స్థానాలు అటు ఢిల్లీలోనూ, ఇటు అమరావతిలోనూ వేడి పుట్టిస్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీలో కూటమికి ఉన్న తిరుగులేని బలంతో ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కావడం ఖాయం. అయితే, ఆ సీట్లు ఎవరికి దక్కుతాయి? అధినేతల మనసులో ఉన్న ఆ అదృష్టవంతులు ఎవరు? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నకూటమిలోని మూడు పార్టీల మధ్య ఇప్పటికే ఒక అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. మొత్తం 4 స్థానాల్లో టీడీపీ 2, జనసేన 1, బీజేపీ 1 చొప్పున పంచుకోబోతున్నాయి. వైఎస్సార్సీపీకి చెందిన అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీ సీట్లు ఖాళీ అవుతుండడంతో ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కసరత్తు వేగవంతమైంది. టీడీపీకి దక్కే రెండు స్థానాల్లో ఒకటి ప్రస్తుత సభ్యుడు సానా సతీష్ కు దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. ఇక మిగిలిన ఒక్క సీటు కోసం అమరావతిలో భారీ ఎత్తున లాబీయింగ్ జరుగుతోంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే వర్ల రామయ్య ఈ రేసులో ముందున్నారు. పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న టీడీ జనార్ధన్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వీళ్లు కాకుండా పలువురు యువకులు కూడా రాజ్యసభ సీటు ఆశిస్తున్నారు. 2024 ఎన్నికల్లో సోషల్ మీడియా బాధ్యతలు చూసి, పార్టీ గెలుపుకు దోహదపడిన చింతకాయల విజయ్ కూడా సీటు ఆశిస్తున్నారు. ఇక లోకేశ్ స్నేహితుడు కిలారి రాజేష్ పేరు కూడా వినిపిస్తోంది. మరోవైపు పార్టీ అంతర్గత వ్యవహారాల్లో కీలకంగా ఉండే సురేశ్ కోనేరు పేరు కూడా అమరావతిలో వినిపిస్తోంది. అంతేకాక భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ కూడా సీటు ఆశిస్తున్నారు. ఇక జనసేన కోటాలో ఒక సీటు ఉండటంతో ఆశావహుల జాబితా చాంతడంత ఉంది. ఇటు పవన్, అటు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ పేరు దాదాపు ఖాయమైందనే ప్రచారం చాలారోజులుగా వినిపిస్తోంది. అయితే ఇప్పుడు పవన్ కల్యాణ్ ఆలోచన మారినట్లు సమాచారం. సినిమా ఇండస్ట్రీ నుంచి ఓ ప్రముఖుడిని రాజ్యసభకు పంపించే ఆలోచనలో పవన్ కల్యాణ్ ఉన్నట్టు సమాచారం. ఒకవేళ అది జరగకపోతే? పార్టీ గళాన్ని వినిపిస్తున్న వేములపాటి అజయ్ కుమార్ లేదా పార్టీ కోసం త్యాగాలు చేసిన ఇతర సీనియర్ నేతల పేర్లు కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఇక బీజేపీ తన సీటును సామాజిక సమీకరణాలకు వేదికగా మార్చుకోబోతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో అండగా నిలిచిన మందకృష్ణ మాదిగ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే అగ్రనాయకత్వం ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. మందకృష్ణకు టీడీపీ, జనసేన కూడా సంపూర్ణ మద్దతు తెలిపినట్లు సమాచారం. జూన్ లో పదవీకాలం ముగుస్తున్నప్పటికీ, ముందస్తుగానే అభ్యర్థులను ఖరారు చేసి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని కూటమి భావిస్తోంది. ఫిబ్రవరి ఆఖరులో లేదా మార్చి మొదటి వారంలో ఈ పేర్లపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి ఈ నాలుగు సీట్ల కేటాయింపు కూటమిలోని అంతర్గత సమీకరణాలను, భవిష్యత్తు రాజకీయాలను ప్రతిబింబించబోతోంది.

# బుట్టా ఫ్యామిలీ దివాలా..!



**కర్నూలు :** ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ, వ్యాపార రంగంలోనూ అత్యంత సంపన్నురాలుగా పేరుగాంచిన మాజీ ఎంపీ బుట్టా రేణుక ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. ఆమె దంపతులు తీసుకున్న వందల కోట్ల రుణాలు బకాయిలుగా మారడంతో, వారు తాకట్టు పెట్టిన ఖరీదైన ఆస్తులను వేలం వేసేందుకు బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు రంగం సిద్ధం చేశాయి. ముఖ్యంగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఈ వేలం ప్రక్రియను చేపట్టింది. బుట్టా రేణుక, ఆమె భర్త బి.ఎస్.నీలకంఠ 2018లో తమ వ్యాపార అవసరాల కోసం ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నుండి సుమారు రూ. 310 కోట్ల రుణాన్ని తీసుకున్నారు. బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్, మెరిడియన్ ఎడ్యుటెక్ సర్వీసెస్ వంటి తమ సంస్థల నిర్వహణ కోసం ఈ నిధులను వినియోగించారు. 15 ఏళ్ల కాలపరిమితితో తీసుకున్న ఈ రుణానికి సంబంధించి ప్రారంభంలో కొన్ని వాయిదాలు చెల్లించినప్పటికీ, గత ఐదేళ్లుగా వారు చెల్లింపులను పూర్తిగా నిలిపివేసినట్లు సమాచారం. వడ్డీతో కలిపి ఈ బకాయిలు ప్రస్తుతం రూ. 340 కోట్ల నుండి రూ. 360 కోట్ల వరకు చేరాయివాయిదాలు చెల్లించకపోవడంతో బకాయిల వసూలు కోసం ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ హైదరాబాద్‌లోని అత్యంత విలువైన ప్రాంతాల్లో ఉన్న పలు ఆస్తులను వేలానికి పెట్టింది. హైదరాబాద్ కేపీహెచ్‌పీ కాలనీలో సర్వే నెంబర్ 1009లోని 3823 చదరపు గజాల స్థలాన్ని వేలం వేయడానికి ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ఫైనాన్స్ బెంగళూరు బ్రాంచి అధికారిక ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం ఆ స్థలంలో మెరీడియన్ స్కూల్ కొనసాగుతుంది. అయితే, మార్చి 24న ఈ స్థలాన్ని ఎల్ఐసీ వేలం వేయబోతోంది. మెరిడియన్ స్కూల్ ఉన్న ఆస్తి కనీసం విలువ రూ. 65కోట్లుగా అధికారులు నిర్ణయించారు. బుట్టా రేణుక 2014 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున కర్నూలు ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బుట్టా రేణుక తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్రకటించారు. మళ్లీ 2019 ఎన్నికల సమయానికి తిరిగి వైసీపీ గూటికి చేరుకున్నప్పటికీ.. ఆమెకు టికెట్ దక్కలేదు. వైసీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమించారు. 2024 ఎన్నికల్లోనూ ఆమెకు ప్రత్యక్షంగా పోటీ చేసే అవకాశం రాలేదు. ఆ తరువాత ఆమె క్రియాశీల రాజకీయాల్లో పెద్దగా కనిపించడం లేదు. బంజారాహిల్స్‌లోని సుమారు 5,000 గజాల ఖరీదైన స్థలం వేలానికి వచ్చింది. దీని రిజర్వు ధర సుమారు రూ. 145 కోట్లుగా నిర్ణయించారు. మాదాపూర్‌లోని 7,205 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ప్రముఖ బుట్టా కన్వెన్షన్ సెంటర్ కూడా వేలం జాబితాలో ఉంది. గతంలో కూడా వీటిని వేలం వేయాలని ప్రయత్నించినప్పటికీ, సాంకేతిక కారణాల వల్ల లేదా వేలం దారుల నుండి స్పందన లేకపోవడం వల్ల ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. బుట్టా రేణుక కుటుంబం కేవలం రాజకీయాల్లోనే కాకుండా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటిగా పేరుగాంచిన బుట్టా గ్రూప్ ను నిర్వహిస్తోంది. ఈ గ్రూపు పలు రంగాల్లో విస్తరించింది. విద్యారంగం, ఆటోమొబైల్ రంగం, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోన్నట్లు తెలుస్తోంది. ఇంకా పలు రంగాల్లో వీరికి పెద్దఎత్తున పెట్టుబడులు ఉన్నట్లు సమాచారం.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం...

-మొదటిపేజీ తరువాయి

ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయాలను కూడా కేబినెట్ ధృవీకరించింది. కొల్లేరు అభయారణ్య సరిహద్దుల ఖరారుకు సంబంధించి కేంద్రానికి పంపాల్సిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అలాగే, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 28న పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ రోజు అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని కూడా తీర్మానించారు. సమావేశం సందర్భంగా రాజమండ్రిలో కల్తీ పాల ఘటన, శ్రీకాకుళంలో డయేరియా కేసులు ప్రబలడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరో ఆసక్తికర అంశంగా, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రసంగాలను కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో విశ్లేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిపై చర్చకు మంత్రులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కూడా సూచించారు. తాజా నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి

## కల్తీ నెయ్యి మహాపాపం

-మొదటిపేజీ తరువాయి

23.01.2026న సీబీఐ ఛార్జిషీట్ వేసిందని తెలిపారు. ఇంక కల్తీ నెయ్యి తయారీకి చాలా రసాయనాలు వాడారని అన్నారు. మోనో గ్లిసరైడ్స్, లాక్టిక్ యాసిడ్ యానిమల్ వెజిటబుల్ ఫ్యాట్ నుంచి వస్తుందని, రంగు కోసం బీటా కెరాటిన్, వాసన కోసం ఎపిటిక్ యాసిడ్ ఈస్టర్, నెయ్యిలా కనిపించడానికి సింథటిక్ ఫ్లేవర్, నురుగు రావడానికి లబ్సా యాసిడ్ డిజర్జెంట్‌లో వాడతారని సీఎం వివరించారు. రాజకీయ వివాదం ఉండకూడదని సిట్ ఏర్పాటు: రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారని సీఎం చంద్రబాబు తెలిపారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించిందని అలానే తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించిందని వెల్లడించారు. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించామని అన్నారు. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారని ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలిందని చెప్పారు. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారని వెల్లడించారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని తాను సొంతంగా ఏమీ చెప్పలేదు ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పానని ఆ భగవంతుడే నాతో చెప్పించాడని సీఎం చంద్రబాబు అన్నారు. వారికి అనుగుణంగా నిబంధనలన్నీ సడలించారని రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధన తొలగించారని సీఎం చంద్రబాబు అన్నారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించారని అలానే రోజుకు 12 టన్నులుగా ఉండాల్సిన వెన్న తయారీ 8 టన్నులకు తగ్గించారని తెలిపారు. డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారని వెల్లడించారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చి ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారని మండిపడ్డారు. వారికి తెలియకుండా జరుగుతాయా: పోమిల్ జైన్, విపిన్ జైన్, భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ ప్రధాన సూత్రధారులని సీఎం వివరించారు. నెయ్యి సరఫరా చేసిన షెల్ కంపెనీలు ఏఆర్ డెయిరీ ఫుడ్స్, శ్రీవైష్ణవి డెయిరీ, మాల్ గంగా మిల్క్ డెయిరీ అని భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలు సహకరించాయని తెలిపారు. లంచం డబ్బుతో చిన్నప్పన్న దొరికిపోయారని ఈ కల్తీ నెయ్యి సరఫరాదారులకు చిన్నప్పన్న సహకారం అందించారని చెప్పారు. తప్పుడు రిటర్నులతో బురిడీ కొట్టించి ల్యాబ్ నివేదిక ఫోర్జరీ చేశారని వివరించారు. ఇన్ని జరిగితే టీటీడీ బోర్డు ఈవో, ఛైర్మన్‌కు తెలియకుండా జరుగుతాయా అని ప్రశ్నించారు. ప్రసాదం తీసుకున్న ప్రతి ఒక్కరూ నాణ్యత తగ్గిందని చెప్పారని సీఎం తెలిపారు.

## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

-మొదటిపేజీ తరువాయి

కరీంనగర్‌లో ఇంటర్ విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఇంటర్ చేసేటపుడు విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. కరీంనగర్, కోరుట్ల ఆర్ఎస్‌యూ అధ్యక్షుడిగా పనిచేసిన తిరుపతి 1978లో జగిత్యాల జైత్రయాత్రతో ఆకర్షితుడయ్యాడు. అనంతరం1982లో సీపీఐఎంఎల్ పీపుల్స్ వార్‌లో చేరి 1984లో గణపతి సూచనలు చేయగా తిరుపతి, మల్లా రాజిరెడ్డి దండకారణ్యానికి వెళ్లారు.

**సెంట్రల్ మిలిటరీ కమిషన్**

మహారాష్ట్ర దండకారణ్యంలో దేవ్‌జీ అజ్ఞాత జీవితం గడిపారని డీజీపీ పేర్కొన్నారు. తిరుపతి గఢ్చిరోలి జిల్లా కార్యదర్శిగా దేవ్‌జీ పనిచేశాడని 2001లో సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా పదోన్నతి పొందినట్లు తెలిపారు. మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యి 2017లో సెంట్రల్ మిలిటరీ కమిషన్ పూర్తి ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టినట్లు ఆయన వివరించారు. మల్లోజుల వేణుగోపాల్ బయటకు వచ్చాక మావోయిస్టు అధికార ప్రతినిధిగా దేవ్‌జీ వ్యవహరించారని, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ ఇన్‌ఛార్జ్‌గా దేవ్‌జీ వ్యవహరిస్తున్నారని డీజీపీ వెల్లడించారు.

**రాజిరెడ్డిది మంథని శాస్త్రపల్లి గ్రామం**

మల్లా రాజిరెడ్డి సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారని ఆయన స్వస్థలం పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రపల్లి గ్రామమని తెలిపారు. మల్లా రాజిరెడ్డిది వ్యవసాయ కుటుంబ నేపథ్యమన్న డీజీపీ 1975లో పెళ్లి తర్వాత భార్య రత్నమ్మతో అజ్ఞాతంలోకి వెళ్లారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో 1998లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రత్నమ్మ చనిపోయారని అన్నారు. మల్లా రాజిరెడ్డి 1974లో ఆర్ఎస్‌యూలో చేరి కిషన్‌జీ మావోయిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడయ్యారన్నారు. 1980లో సీపీఐఎంఎల్ పీడబ్ల్యూ ప్రారంభించాక బొగ్గు గనుల ప్రాంతంలో ఉద్యమ నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు.

## ఏటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక డ్యాష్ బోర్డు తయారు చేసి అందుబాటులోకి తెచ్చేందుకు 20 నెలలు పట్టిందని వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల వారీగా ఎంత మంది పిల్లలు చదువుతున్నారు, ఎంత మంది అధ్యాపకులు ఉన్నారో డేటా తయారు చేశామని దీని ప్రకారం అవసరమైన పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. కళాశాలల్లో మిడ్ డే మీల్?ను ప్రారంభించి ల్యాబ్?లను ఆధునికీకరించామని, జూనియర్ కళాశాలల్లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. డీఎస్సీ నిర్వహించి ఖాళీ పోస్టులు భర్తీ: ప్రతి ఏటా రిటైర్మెంట్ ప్రకారం ఖాళీలు గుర్తించి ఎప్పటి కప్పుడు టీచర్ల నియామకాలు చేపడతామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది డీఎస్సీని నిర్వహించి ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదని కూటమి ప్రభుత్వం వచ్చాక 16,000 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల్లో అధ్యాపకుల కొరత, సమస్యలపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, కావలి గ్రీష్మ, బీటీ.నాయుడు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఎస్సీఈఆర్టీని కూటమి ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్న మంత్రి పాఠశాలల్లో కరిక్యులమ్?ను మార్చి బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల్లో ఇన్ ఫ్రా, డైట్?ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పిల్లల సత్ప్రవర్తన పెంచేందుకు చాగంటి కోటేశ్వరరావు ద్వారా ప్రవచనాలు అందిస్తున్నామని, ఏఐ సాంకేతికతను వినియోగించి విద్యార్థుల మెంటల్ హెల్త్ మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. లోకేశ్ పనితీరుపై హైకోర్టు ప్రశంస: మంత్రి నారా లోకేశ్ పని తీరును హైకోర్టు ప్రశంసించింది. కస్తూర్బా పాఠశాలల్లో ఉపాధ్యాయుల జీతాలు పెంచి పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేస్తామని మంత్రి ప్రకటన చేశారని వ్యాఖ్యానించింది. సమస్యలపై మంత్రి లోకేశ్ తక్షణమే స్పందించి పరిష్కరిస్తున్నారని తెలిపింది. వసతి గృహంలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనపై మంత్రి లోకేశ్ వెంటనే స్పందించారని కితాబిచ్చింది. మంత్రి ఆస్థాయిలో పనిచేస్తుంటే, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారని హైకోర్టు మండిపడింది.

ప్రశ్నించే హక్కే...
జనసేన
తెలుగు వార్తా పత్రిక

## సంపాదకీయం

# గాల్గోటియా వివాదం భారత ప్రతిష్టకు మచ్చ!

న్యూఢిల్లీలో ఫిబ్రవరి 16–20 మధ్య నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు భారత ఏఐ ప్రతిష్టను ప్రపంచానికి చాటే అవకాశంగా నిలిచింది. అయితే స్టాల్‌లో ప్రదర్శించిన రోబోటిక్ డాగ్ వివాదం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసి, ఏఐ పరిశోధనల నైతికతపై ప్రశ్నలను లేవనెత్తింది. 'భద్రమైన, నైతికమైన, మానవకేంద్రిత ఏఐ' అనే నినాదంతో జరిగిన ఈ సమ్మిట్ 4వది ఇంతకుముందు మూడు అంతర్జాతీయ సమ్మిట్‌లు యూకే, సియోల్, ప్యారిస్ దేశాల్లో జరిగాయి. దీనికి జాతీయ అంతర్జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున ప్రాచుర్యం దక్కింది. ఇందులో అంతర్జాతీయ ఏఐ సమ్మిట్‌లో ప్రభుత్వాలు, అంత ర్జాతీయ సంస్థలు, టెక్ కంపెనీలు, శాస్త్రవేత్తలు, విశ్వ విద్యాలయాలు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో భాగంగా గాల్గోటియ యూనివర్సిటీ తమ స్టాల్‌లో ఒక ఏఐ ఆధారిత రోబోటిక్ డాగ్‌ను ప్రదర్శించింది. మొదట ఇది తమ యూనివర్సిటీ పరి శోధన ఫలితంగానే తయారుచేశామని దాని పేరు 'ఓరియన్' అని ఆ యూనివర్సిటీ ప్రతినిధి ప్రకటించింది. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కూడా తన ఎక్స్ ఖాతా ద్వారా ఇదే విషయాన్ని పోస్ట్ చేశాడు.. దేశ మీడియాలో దీనికి విశేష ప్రాచుర్యం పొందింది. కానీ కొద్ది గంటల్లోనే ఆ రోబో డాగ్ చైనా కంపెనీ తయారు చేసిన కమర్షియల్ ఉత్పత్తి అని దాని పేరు యూనిట్రీ అని వెలుగులోకి వచ్చింది. 3 లక్షల డాలర్లు చెల్లిస్తే ఎవరైనా ఆన్లైన్ ద్వారా కొనుగోలు చేయవచ్చు అని వెలుగులోకి వచ్చింది. దీని తర్వాత సదరు యూనివర్సిటీ అది కేవలం విద్యార్థుల సందర్శనార్థం మాత్రమే పెట్టిందని తమ సంస్థ తయారు చేయలేదని వివరించింది. తామే తయారు చేశామని తప్పుడు సమాచారం ఇచ్చిందన్న కారణంతో తమ యూనివర్సిటీలోని ఒక మహిళ అధ్యాపకురాలని బాధ్యుల్ని చేసింది. అంతర్జాతీయ వేదికపై భారత్ పరువు తీసిందని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో గ్లోబల్ సమ్మిట్ స్టాల్‌ను గాల్గోటియా యూనివర్సిటీ అర్ధాం తరంగా ముగించుకుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ గ్లోబల్ సమ్మిట్‌లో ఈ యూనివర్సిటీ చైనా నుండి కొనుగోలు చేసిన రోబోటిక్ డాగ్‌ను తమ యూనివర్సిటీ విద్యార్థులు ఏఐను ఉపయోగించి తయారు చేసినట్టుగా యూనివ ర్సిటీలో 350 కోట్లతో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ ల్యాబ్‌ను స్థాపించినట్టుగా గ్లోబల్ సమ్మిట్ వేదికగా ప్రకటించింది. కరోనా సమయంలో కూడా ధ్వని తరంగాల ద్వారా కరోనా వైరస్‌ను అంతమొందించవచ్చని ఈ యూనివర్సిటీ విద్యార్థి పరిశోధన ద్వారా నిరూపితం అయిందని ప్రకటించి నవ్వుల పాలయ్యింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ యూనివర్సిటీ విద్యా ర్థులను బీజేపీ తన ఎన్నికల ప్రచారాన్ని కోసం తీవ్రంగా వాడుకుంది. మరి ముఖ్యంగా ఈ ప్రైవేట్ యూనివర్సిటీ యాజమాని సునీల్ గల్గోటియాకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో, బీజేపీ పార్టీతో చాలా సత్సంబంధాలు ఉన్నాయి.. అందుకే వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేవలం గ్లోబల్ సమ్మిట్‌లో స్టాల్‌ను ఖాళీ చేయాలని మాత్రమే ఆదేశించారు. బీజేపీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ ప్రశ్నిస్తున్న దేశ ప్రజలను దేశద్రోహులుగా, టెర్రరిస్టులుగా, ఉగ్రవాదులుగా, పాకిస్తాన్ చైనా ఏజెంట్లుగా ముద్రలు వేస్తున్న బీజేపీ, కేంద్ర ప్రభుత్వం నేడు అంతర్జాతీయ వేదికపై దేశం పరువు తీసిన గాల్గోటియ యూనివర్సిటీపై ఏ విధమైన చర్యలు తీసు కోకపోవడం నేడు వీరి కపట దేశభక్తిని ప్రశ్నిస్తుంది. దేశంలో విద్యా ప్రవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ వేగంగా జరుగుతుంది. దేశంలో ఉన్న ప్రతిష్టాత్మక యూనివర్సిటీలకు నిధులు కేటాయించడం లేదు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయడం లేదు. ఆ యూనివర్సిటీలలో చదువుకునే విద్యార్థులకు ఫెలోషిప్ స్కాలర్షిప్స్‌లు ఇవ్వడం లేదు. విద్యార్థుల మెదళ్లను కలుషితం చేసేలా మతోన్మాదాన్ని ప్రేరేపించే సిలబస్‌ను తీసుకొస్తున్నారు. మరోవైపు దేశంలో ప్రైవేట్ యూనివర్సిటీలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు విదేశీ యూనివర్సిటీలు కూడా తీసుకొస్తామ ని పాలకులు పెద్ద ఎత్తున చెబుతున్నారు.. కానీ ప్రభుత్వ యూనివర్సిటీలు పట్టించుకోకపోతే గాల్గోటియ ప్రైవేటు, విదేశీ యూనివర్సిటీలు దేశంలో విచ్చలవిడిగా వస్తే మన దేశ విద్యార్థులకు విద్య దూరమవ్వవడమే కాకుండా అంతర్జాతీయ వేదికల్లో దేశ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని దానికి ఒక మంచి ఉదాహరణ. గాల్గోటియా పరిణామం కేవలం ఒక యూనివర్సిటీకి సంబంధించిన అంశంగా కాకుండా, భారత ఏఐ పరిశోధనల నైతికత, పారదర్శకతపై ప్రశ్నలను లేవనెత్తింది.

# నిరాదరణ నీడలో అపురూప దేవాలయం

భారతీయ ప్రాచీన సంస్కృతికి, హైందవ సనా తన సాంప్రదాయాలకు పట్టుకొమ్మగా నిలిచి, ప్రధానంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రైమూర్త్య నిలయమై, వరదాయినియై, భక్తి ముక్తి ప్రదాయినియై, పరమ పావనియైన పవిత్ర గోదావరినదీ తీరాన వెలసి, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యత సంతరించుకుని, హిందూ ముస్లిం మత సామరస్యానికి అనాదిగా ప్రతీకగా, దక్షిణ కాశిగా, హరి హర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో నొకటిగా రాష్ట్రంలో వాసికెక్కి, నిత్య భక్త జన సందడితో, నిరంతర దైవనామ స్మరణలతో విరాజిల్లుతున్న పవిత్ర తీర్థం – ప్రాచీన ధర్మపురి పుణ్య క్షేత్రం. రాష్ట్రంలోనే గాక, వేరెచ్చటనూ లేని విధంగా, ఈక్షేత్రంలో గల దేవాలయాలు, ఒక్కొక్కటి ప్రత్యేక ప్రతిపత్తిని, ప్రత్యేకతను, వైశిష్ట్యాన్ని కలిగియుండడం విశేషం. అలాంటి ఆలయాలలో అత్యంత వైశిష్ట్యాన్ని సంతరించుకుని, పౌరాణిక, చారిత్రక నేపథ్యాన్ని కలిగిన పతివ్రతా శిరోమణి అయిన సత్యవతీ దేవి ఆలయం, ఆ సాధ్వీమణి పాతివ్రత్యానికి నిలువెత్తు సాక్షిభూతంగా నిలిచిన సైకత (ఇసుక) స్థంభం, దేశంలో వేరెక్కడా లేని విధంగా శివ పానవట్టం మీద నారసింహ విగ్రహం కలిగి శివకేశవాద్వైత సాంప్రదాయానికి ప్రతీకయైన అరుదైన విగ్రహాలు నిరాదరణ నీడలో మగ్గుతున్నా యి. ఒకనాడు మహోజ్వలంగా వెలుగొంది సనాతన హిందూ స్త్రీల ధర్మాచరణ సాంప్రదాయంలో భాగంగా, నారీ లోకానికి ఆదర్శమూర్తిగా నిత్య పూజలనందుకున్న సత్యవతీ దేవి ఆదరణ కరువై, నిర్లక్ష్యానికి గురవుతున్నది. వేదవ్యాస విరచి తంగా భావించబడే బ్రహ్మాండ, స్కాందాది పురాణాంతర్గతమైన ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం గ్రంథంలో సత్యవతీదేవి పాతివ్రత్య వృత్తాంతం వర్ణించ బడింది. నైమిశారణ్యంలో, శౌనకాది మహర్షులకు, సూత పౌరాణికుడు వివరించిన ప్రకారం, నారద మహర్షి పృథు చక్రవర్తికి చెప్పిన విధంగా, పూర్వము సింధు దేశమును పాలించిన వీరసేనుడను రాజు ఆజ్ఞ ప్రకారం జయుడను ఆయన పురోహితుడు, యుక్త వయస్కురాలైన రాకుమారికి, సర్వలక్షణ సమన్వితుడైన రాకుమారుని వరునిగా చేయ సంకల్పించి, ఎన్నో దేశాలు తిరిగి చిత్ర పటములు తెచ్చినా, ఆమె మెచ్చకుండిన కారణంగా విసుగు చెంది, మంత్రోపాయము చేత ఒక సర్పమును బంధించి తెచ్చి, పేటిక యందుంచి, కులాచార ప్రకారం, వరుని చూడకయే యుక్త సమయమున వివాహ మాడమని చెప్పి, దేశము వదలి వెడలి పోయెను. వివాహ ముహూర్త సమయంలో పేటిక తెరచి, భయంకర సర్పమును గాంచి, జరిగిన మోసమును గ్రహించి, వచన బద్ధురాలై, రాకుమారి పామునే తన భర్తగా స్వీకరించెను. ఆ సర్పమును కంఠమున ఉత్తరీయము వలె ధరించి, భగవదనుగ్ర హమునకై తీర్థయాత్రల కేగి, పుణ్య క్షేత్రములను తిరుగుతూ, దండకారణ్య మందలి పుణ్యభూమి యగు ధర్మపురికి ఏతెంచి, పవిత్ర గౌతమీ జలా లలో సర్పముతో కూడి స్నానమాచరించెను. తక్షణమే సర్పము దివ్య పురుషునిగా మారెను. ప్రజలందరి సంశయమును తీర్చి, పాతివ్రత్య నిరూపణకై మూడు ముష్టుల ఇసుకను పిడికిలితో పోయగా, ఆ ప్రదేశమందు సైకతము ఇసుక స్థంభముగా మారెను. రాజకుమారి విజయ సత్యవతి యని పాతివ్రత్య మహిమ కారణంగా సార్థక నామధేయురాలు కాగా, ఆ మహాసాధ్వి స్నాన మాచరించిన స్థలము సత్యవతీ కుండము అని నామాంకితయ య్యెను. అనంతర కాలంలో, సత్యవతీ కుండములో స్నాన మాచరించి, ఆమె దర్శనం చేసుకుని, స్థానిక ఇలవేలుపైన శ్రీనృసింహుని మందిరానికి వెళితే, ఒక్కొక్క పాదమున ఒక్కొక్క అశ్వమేధ యజ్ఞ ఫలం లభించునట్లు వరములు పొందెనని స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక చారిత్రిక అంశానికొస్తే స్థానిక ఓరియంటల్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రాచార్యులు, చారిత్రక పరిశోధకులు, బహుభాషావేత్త డాక్టర్ సంగనభట్ల నర్సయ్య చారిత్రిక పరిశోధనల ఫలితంగా ఇది అపురూపమైన హరిహరనాథ ఆలయంగా భావించ బడుతున్నది. శివ, కేశవులకు అభేదాన్ని పాటించే హరి హర క్షేత్రంలోని ఈఆలయంలో భారతదేశంలో వేరెచ్చటనూ కానరాని విధంగా పానవట్టం మీద నార సింహుని విగ్రహం ఉండడం విశేషం. 11వ శతాబ్దికి చెందిన ఈ ఆలయం మొదట శివాలయమని, తరువాత నారసింహాల యమని, ప్రస్తుతం సత్యవతి అలయమని డాక్టర్ నర్సయ్య పరిశోధన ద్వారా తేల్చి చెప్పారు. ఇక్కడి స్తంభం చాళుక్యుల కాలంనాటి విజయ స్థంభమని పేర్కొన్నారు. ఆరు అడుగుల ఎత్తుగా వితర్ధిక కట్టి, దానిపై ఆలయం నిర్మితమైంది. ఆలయ గర్భంనుండి కప్పును చీల్చుకుని అత్యంత ఎత్తుగా నిలిచిన స్థంభము నానుకునే పానవట్టం, దానిపై లింగం స్థానంలో నరసింహుని విగ్రహం ఉంది. దీని పక్కగా పడగ నీడలో లక్ష్మీనారాయణ విగ్రహం ఉంది. కుడిపక్కన నూనె కారుతున్నంత నునుపుగా అమ్మవారి విగ్రహం ఉంది. ఆళ్వారుల విగ్రహాలూ ఉన్నాయి. ఆలయ ప్రవేశంలో రెండు ఆంజనేయస్వామి విగ్రహాలు ఎదురెదురుగా ఉన్నాయి. ద్వారబంధంపై శేషసాయి విష్ణుమూర్తి విగ్రహముంది. ఇంతటి ప్రాధాన్యతను కలిగిన సత్యవతీ ఆలయం తదంతర్గత ఇసుకస్థంభం, ఆలయం లోని అరుదైన విగ్రహాలు ప్రస్తుతం ఆదరణ లేక శిథి లావస్థకు చేరుకున్నాయి. బ్రహ్మపుష్కరిణికి ఎత్తయిన ప్రదేశంలోగల సత్యవతీ ఆలయాన్ని తాజామాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవ ఫలితంగా, రాష్ట్ర దేవాదాయ శాఖ స్వాధీన పరుచుకుని, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి అనుబంధంగా జేసి ప్రత్యేక నిధులతో, క్షేత్ర ప్రాధాన్యతను ఇనుమడింప జేస్తూ సనాతన ఆలయాలను పునరుద్ధరించే చర్యలు గైకొనే చర్యలకు శ్రీకారం చుట్టారు. 20లక్షల ప్రత్యేక నిధులతో పునర్నిర్మాణ పనులు మంజూరి అయి టెండర్లు పిలిచారు. సరైన టెండర్లు రానందున పనులు ప్రారంభింప బడ లేదు. ప్రస్తుత రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని...దేవాదాయ శాఖ పక్షాన ప్రత్యేక నిధులతో, ఆలయ జీర్ణోద్ధరణ పనులను వెనువెంటనే చేపట్టే చర్యలు తీసుకోవాలని స్థానికులు ముక్త కంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

# సమీకరణలు దిశగా ప్రజాతీర్పు

తెలంగాణ రాజకీయ ప్రస్థానంలో స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పరిపాలనా ప్రక్రియలు మాత్రమే కావు; అవి రాష్ట్ర రాజకీయ దిశను నిర్దేశించే సూచికలు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు ప్రజాస్వామ్యపు పునాది స్థాయిలుగా వ్యవహరిస్తూ ప్రజా అభిప్రాయాన్ని నేరుగా ప్రతిబింబిస్తాయి. ఈ స్థాయిలో వ్యక్తమయ్యే ప్రజా తీర్పు రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే శక్తి కలిగి ఉంటుంది. అందువల్ల పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రాజకీయ వర్గాల్లో సహజంగానే ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత స్థానిక సంస్థల వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి ప్రభుత్వా నికీ ఒక ప్రధాన కార్యసూచిగా నిలిచింది. గ్రామీణాభివృద్ధి, పథకాల వికేంద్రీకరణ, ప్రజాపాలనలో పారదర్శకత? ఇవన్నీ పరిషత్ వ్యవస్థ ద్వారా అమలవుతున్నాయి. మండల పరిషత్, జిల్లా పరిషత్ సంస్థలు అభివృద్ధి పనుల పర్యవేక్షణ, నిధుల వినియోగం, స్థానిక అవసరాల గుర్తింపు వంటి అంశాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ఈ ఎన్నికలు సాధారణ రాజకీయ ప్రక్రియల కంటే ఎక్కువ ప్రాధాన్యం సంతరించు కున్నాయి.రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు ఐదేళ్ల పదవీకాలం నిర్దేశించ బడింది. గడువు ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ బాధ్యత. అయితే ఎన్నికల సమయ నిర్ణయంలో రాజకీయ వాతావరణం, పరిపాలనా సిద్ధత, చట్టపరమైన అం శాలు ప్రభావం చూపుతాయి. ఇప్పటికే పరిషత్ ఎన్నికల విషయంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. ప్రస్తుతం పరిషత్ ఎన్నికల సమయంపై ప్రభుత్వం సమగ్రంగా ఆలోచి స్తున్నదన్న సంకేతాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని ప్రధాన అజెండాగా ముందుకు తీసుకొచ్చినట్లు ప్రకటిస్తోంది. రైతు సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల ను ప్రజల ముందుంచి ఎన్నికలకు వెళ్లాలన్న వ్యూహం కనిపి స్తోంది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల అంశంలో స్పష్టత వచ్చిన తరువాత ఎన్నికలు నిర్వహించడం రాజకీయపరంగా అను కూల వాతావరణాన్ని సృష్టించ వచ్చని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక అంశం. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ట్రిపుల్ టెస్ట్ విధానం, సామాజిక వర్గాల జనాభా ఆధారిత డేటా వంటి అంశాలు రిజర్వేషన్ నిర్ణయంలో ప్రభావం చూపుతా యి. రిజర్వేషన్లపై స్పష్టత లేకుండా ఎన్నికలకు వెళ్లడం చట్టపరమైన చిక్కులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. అందువల్ల ప్రభుత్వం ముందుగా చట్టబద్ధ ప్రక్రియలను పూర్తి చేసి, అవసరమైన అధ్యయనాలు, కమిషన్ నివేదికలు, గణాంక ఆధారాలను సిద్ధం చేసి ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి ఒక రాజకీయ సూచికగా మారాయి. పట్టణాల్లో లభించిన మద్దతు గ్రామీణ ప్రాంతాల్లో ఎంతవ రకు ప్రతిఫలిస్తుందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. గ్రామీణ ఓటరు భావజాలం, వ్యవసాయ పరిస్థితులు, పంటల ధరలు, ఉపాధి హామీ పథకాల అమలు, సంక్షేమ పథకాల చేరువ? ఇవన్నీ పరిషత్ ఎన్నికలపై ప్రభావం చూపే అంశాలు. ప్రభు త్వం ఈ అంశాలపై సమీక్షలు నిర్వహిస్తూ ఎన్నికల సమ యంపై నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది. బడ్జెట్ సమావే శాల అనంతరం ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం తన ఆర్థిక ప్రాధాన్యతలను ప్రజలకు స్పష్టంగా తెలియ జేయగలదని భావిస్తోంది. బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, యువత ఉపాధి కార్యక్రమాలకు అధిక కేటాయింపులు చేస్తే అది ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రంగా మారే అవకాశం ఉంది. బడ్జెట్ ప్రకటనల ద్వారా సంక్షేమ హామీలను పునరుద్ఘాటించి ఎన్నికల మైదానంలోకి దిగడం రాజకీయంగా అనుకూలమని విశ్లేషకులు సూచిస్తున్నారు.సామాజిక సమీకరణ పరిషత్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా స్థానిక నాయకత్వంలో విస్తృత ప్రతినిధిత్వం కల్పించ బడుతుంది. అయితే రిజర్వేషన్ శాతం, వార్డు పునర్విభజన, జనాభా గణాంకాల ఖచ్చితత్వం వంటి అంశాలు వివాదాలకు దారితీ యవచ్చు. ప్రభుత్వం ముం దస్తుగా చట్టపరమైన అభ్యంతరాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యోచిస్తోంది. రిజర్వేషన్ల ప్రకటనతోనే స్థానిక రాజకీయ సమీకరణాలు మారిపోతాయి కాబట్టి అభ్యర్థుల ఎంపికలో అన్ని పార్టీలూ జాగ్రత్తగా వ్యవహరించే అవకాశ ముంది. పరిషత్ ఎన్నికలు సాధారణంగా పార్టీ గుర్తులపై వాస్త వానికి రాజకీయ పార్టీల మద్దతుతో నిర్వహించ బడుతుం డగా... గ్రామస్థాయిలో పార్టీ ప్రభావాన్ని కొలిచే పరీక్షగా ఈ ఎన్నికలు భావించ బడుతున్నాయి. అధికార పార్టీకి ఇది తన పాలనపై ప్రజల అభిప్రాయాన్ని అంచనా వేసే వేదిక. ప్రతిపక్షాలకు ప్రభు త్వంపై ఉన్న అసంతృప్తిని సమీకరించే అవకాశం. ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, కూటముల అవకాశాలు? ఈ ఎన్నికల్లో కీలక అంశాలుగా మారనున్నాయి.పరిపాలనా పరంగా కూడా ఎన్నికల నిర్వహణ పెద్ద సవాలు. ఓటరు జాబితాల నవీకరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళిక అవసరం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారదర్శక ప్రక్రియను అమలు చేయాలన్న ఆలోచన ప్రభుత్వ వర్గాల్లో ఉంది. యువత, మహిళా ఓటర్ల ప్రాధాన్యతను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణిస్తోంది. గ్రామీణ యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం, గ్రామీణ వ్యాపారాలకు ప్రోత్సాహం?ఇవన్నీ ఎన్నికల సమయంలో ప్రధాన చర్చాంశాలుగా మారవచ్చు. సామాజిక సంక్షేమ పథకాల అమలు ప్రజల్లో ఎంతవరకు సానుకూల భావన కలిగించిందన్నది ఎన్నికల ఫలితాల్లో ప్రతిఫలించే అవకాశం ఉంది.రాజకీయంగా చూస్తే పరిషత్ ఎన్నికలు భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలకు ఒక ముందస్తు సంకేతంగా భావించ బడుతున్నాయి. గ్రామీణ ఓటరు మద్దతు ఏ దిశగా ఉందన్నది స్పష్టమవుతుంది. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత, బడ్జెట్ సమా వేశాల అనంతర రాజకీయ వాతావరణం, పరిపాలనా సిద్ధత ఈ మూడు అంశాల సమన్వయం ఆధారంగానే తుది నిర్ణ యం వెలువడే అవకాశముంది. మొత్తానికి పరిషత్ ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు కావచ్చని చెప్పవచ్చు. ప్రజాస్వామ్యపు పునాది స్థాయిలో జరిగే ఈ ఎన్ని కలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్దేశించే శక్తి కలిగి ఉన్నాయి. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పరిపాలనా సామర్థ్యాన్ని ప్రజల ముందుంచి మద్దతు కోరుతుండగా, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ పోటీకి సిద్ధమవుతున్నాయి.

## అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి భరోసా ఏది?

ఏ రాష్ట్రమైన, ఏ దేశమైన అభివృద్ధి చెందాలంటే అత్యున్నత విలువ లతో కూడిన ప్రాంతంగా విలసిల్లాలంటే, ఆ ప్రాంతంలోని ఉన్నత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది చారిత్రక సత్యం, అయితే మన రాష్ట్రంలోని ఉన్నత విద్యను పరిశీలించినట్లయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఉన్నత విద్య రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. కొత్త యూనివర్సిటీలు, కొత్త కోర్సులు, న్యాక్ ర్యాంకింగ్స్, డిజిటలైజేషన్, పరిశోధనలపై దృష్టి.. ఇలా ప్రభుత్వాలు తరచూ ఉన్నత విద్య అభివృద్ధి గురించి మాట్లాడుతున్నాయి. ఆ మాటలు ఆచరణలో సాధ్యం కావడానికి విద్యాభివృద్ధిలో నిత్యం వెనుక నుండి పనిచేస్తూ వ్యవస్థను నడిపించే నాన్ టీచింగ్ సిబ్బంది పరిస్థితి మాత్రం అగమ్య గోచరంగా తయారయ్యింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 18 యూనివర్సిటీల్లో, ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, అంబేద్కర్, శాతవాహన, మహాత్మాగాంధీ యూనివర్సిటీ, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, ఆచార్య ఎన్.జి. రంగా యూనివర్సిటీ, కాళోజి అగ్రికల్చరల్ యూనివర్సిటీ మొదలగు వాటిల్లో సుమారు 5 నుండి 6వేల మంది పై చిలుకు బోధనేతర సిబ్బంది నాన్‌టీచింగ్(అవుట్‌సోర్సింగ్) ఉద్యోగులు పనిచే స్తున్నారు. వీరిలో చాలా మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ విధానంలో పనిచేస్తున్నారు. యూనివర్సిటీ పరిపాలన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల సర్టిఫికెట్లు, లైబ్రరీలు, ల్యాబ్‌లు, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక విభాగాలన్నింటినీ నడిపిస్తున్నవారు వీరే. అయినా సరే, వీరి జీవన భద్రతపై ప్రభుత్వానికి ఎందుకు శ్రద్ధ లేదు?గత ఏడేళ్లుగా వీరి వేతనాల్లో ఎలాంటి గణనీయమైన సవరణ లేదు. చాలాచోట్ల సకాలంలో జీతాలు కూడా అందడం లేదు. ఒకవైపు ధరలు పెరుగుతుంటే, మరోవైపు స్థిర ఆదాయం లేక కుటుంబ బాధ్యతలు ఎలా నిర్వహించాలన్నది అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పెద్ద సమస్యగా మారింది. యూనివర్సిటీల్లో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా, వారికి లభించే ప్రయో జనాలు మాత్రం నాన్‌టీచింగ్ సిబ్బందికి దక్కడం లేదు. 'సమాన పనికి సమాన వేతనం' అన్న సూత్రం వీరి విషయంలో ఎందుకు అమలు కావడం లేదు? ప్రభుత్వం తరచూ విద్యా వ్యవస్థలో నాణ్యత పెంచాలంటూ ప్రక టనలు చేస్తోంది. న్యాక్ ర్యాంకులు మెరుగుపడాలంటే అకడమిక్ స్టాఫ్‌తో పాటు పరిపాలనా వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. కానీ ఆ వ్యవస్థను నడిపించే సిబ్బందే అసంతృప్తితో ఉంటే, నాణ్యత ఎలా పెరుగుతుంది? ఉద్యోగ భద్రత లేని సిబ్బందితో సమర్థవంతమైన పరిపాలన సాధ్యమా ఉన్నత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని చెప్పుకునే గొప్పలు ఎండమావులు కాక ఏమవుతావుతాయి? నాన్‌టీచింగ్ సిబ్బంది డిమాండ్లు కొత్తవేమీ కాదు. రెగ్యులరైజేషన్, వేతన సవరణ, సామాజిక భద్రత, ప్రమోషన్లు వంటి అంశాలు ఎన్నో ఎండ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం మారినా, హామీలు ఇచ్చినా, ఫైళ్లు కదలడం లేదు.

# ప్రజా ఫిర్యాదులపై మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టి...

**పోలీసు కాలనీ పార్క్ అభివృద్ధికి వేగం**

**పార్కు సమస్యలపై హరీష్ బాబు ప్రత్యక్ష పరిశీలన... తక్షణ చర్యలకు ఆదేశాలు**

**శుభ్రత, లైట్లు, వాకింగ్ ట్రాక్, పిల్లల సదుపాయాలపై త్వరిత చర్యలు**

**ధర్మవరం, ఫిబ్రవరి 24:( జనసేన ప్రతినిధి):**ధర్మవరం పట్టణంలోని పోలీసు కాలనీలో ఉన్న శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ మునిసిపల్ పబ్లిక్ పార్క్ అభివృద్ధి, శుభ్రత, ప్రాథమిక సదుపాయాల మెరుగుదలపై వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందిస్తూ చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రజా సమస్యలపై అప్రమత్తంగా స్పందించాలనే దృక్పథంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యాలయం దృష్టి సారించగా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు మంగళవారం పార్కును ప్రత్యక్షంగా సందర్శించి సమగ్రంగా పరిశీలించారు.పార్కులో పేరుకుపోయిన చెత్త, పాడైపోయిన విద్యుత్ దీపాలు, చిన్నారుల ఆట పరికరాల కొరత, వాకింగ్ ట్రాక్ దెబ్బతినడం వంటి సమస్యలను ఆయన గుర్తించారు. అదేవిధంగా పార్కులో శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలన్న ప్రజల అభ్యర్థనను కూడా పరిశీలనలోకి తీసుకున్నారు. చిన్నారుల కోసం రంగులరాట్నం, ఫైబర్ ఉయ్యాలలు వంటి వినోద సదుపాయాలు కల్పించాల్సిన అవసరాన్ని స్థానికులు వినిపించారు.పార్కు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించేందుకు మున్సిపల్ అధికారులతో మాట్లాడి తక్షణ శుభ్రత



చర్యలు చేపట్టాలని హరీష్ బాబు ఆదేశించారు.పాడైపోయిన లైట్ల స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు.పోలీసు కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో మున్సిపాలిటీ ఇచ్చిన రెండు నీటి కనెక్షన్ల వద్ద వాటర్ చాంబర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించి సంబంధిత అధికారులకు సూచనలు



ఇచ్చారు.మిగిలిన అభివృద్ధి పనులు, పార్కు సదుపాయాల విస్తరణ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల మెరుగుదలపై మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం కల్పిస్తామని హరీష్ బాబు తెలిపారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి ఫిర్యాదును గౌరవంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పార్కును ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన, సౌకర్యవంతమైన విశ్రాంతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతాయని హామీ ఇచ్చారు. ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనులు వేగవంతం చేస్తామని తెలిపారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం రూరల్ మండలం**

**జనసేన ప్రతినిధి బి రాము ఫిబ్రవరి 24 :**తాగునీరు, రోడ్ల నిర్మాణాల కోసం వినతి పత్రం అందజేసిన సునీత మంత్రులు లోకేష్, రాంప్రసాద్ రెడ్డి, జనార్ధన్ రెడ్డిలతో కూడా భేటి నియోజకవర్గంలోని సమస్యల్ని వివరించి నిధులు ఇవ్వాలని కోరిన సునీతసానుకూలంగా స్పందించిన పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత భేటి అయ్యారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆమె పవన్ కళ్యాణ్ ఛాంబర్ లో ప్రత్యేకంగా భేటి అయ్యారు. తమ నియోజకవర్గంలో తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. వేసవి కాలం మొదలైన నేపథ్యంలో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారనుందని.. దీని వలన గ్రామస్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో అత్యవసర నీటి సరఫరా పనులను అమలు చేయడం కోసం సీపీడబ్ల్యూఎస్ కు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతపురము రూరల్ మండలములోని 27 గ్రామాలకు, మరియు ఆత్మకూరు మండలములోని 25 గ్రామాలకు ఇస్తున్న సమగ్ర సురక్షిత మంచినీటి పథకం ఇంతవరకు సత్యసాయి నీటి పథకంపై ఆధారపడి ఉందన్నారు. పథకం ఏర్పాటు చేసి 30 సంవత్సరాలైనా.. ఇప్పటికీ అంతరాయాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ 52 గ్రామాలకు గాను రూ.50కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అనంతపురము రూరల్ మండలంలోని 12గ్రామాలకు, రాప్తాడు మండలంలోని 26 గ్రామాలకు ఇంత వరకు సరైన నీటి సౌకర్యం లేక తాగునీటికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అనంతపురం రూరల్ ప్రాంతాల్లో సమ్మర్ స్టోరేజి ట్యాంకును, పైపు లైనుల మరమ్మత్తులు చేయడంతో పాటు 2ఎం.ఎల్.డి. స్లో సాండ్ (ఫ్లా) ఫిల్టర్ల స్థానంలో 6ఎంఎల్.డి. రాపిడ్ సాండ్ ఫిల్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు రూ.55కోట్ల అవసరం ఉంటుందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో అన్ని గ్రామాలకు తాగునీటి అవసరాలకు గొల్లపల్లి రిజర్వాయర్ నుండి సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు రామగిరి, కనగానపల్లి, సీ.కే.పల్లి, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రోడ్లు చాలా దయనీయ స్థితిలో ఉన్నాయన్నారు. దీని వలన చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.



ఇక్కడ రోడ్ల పునర్నిర్మాణం కోసం రూ.11.50 కోట్లు రూపాయలు అవసరం ఉన్నందున నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. తాగునీటి అవసరాలు తీర్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలలో జలజీవన్ మిషన్ క్రింద చేస్తున్న పనులకు సంబంధించిన బిల్లులతో పాటు ఈ రూ.11.50కోట్ల రోడ్డు పనులకు అనుమతులు మంజూరు చేస్తానని, గతంలో అడిగిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించవచ్చని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి పనులు, సమస్యల పై మంత్రులను కలిసిన ఎమ్మెల్యే సునీత**

రాప్తాడు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అలాగే సమస్యలపై ఎమ్మెల్యే పరిటాల సునీత పలువురు మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అసెంబ్లీ లాబీలోనే మంత్రి నారా లోకేష్ ని కలిసి ఆత్మకూరు మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలకు ఆడిటోరియం, కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.60లక్షల నిధులు కేటాయించాలని కోరారు. ఆత్మకూరు మండలంలో ఎస్సీ ఎస్టీ జనాభా ఎక్కువగా ఉండటం వలన ˜్రాూఔ= స్కూల్ మంజూరు చేయాలని, ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో పెండింగ్ లో ఉన్న నసనకోటలో ఎంజేపీ బాలికల గురుకుల జూనియర్ కాలేజీ ఫైల్ క్లియర్ చేయాలని కోరారు. రామగిరి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల కోసం హాస్టల్ మంజూరు చేసి భవన నిర్మాణానికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మరో మంత్రి మండ్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండల కేంద్రాల్లో అసంపూర్తిగా ఉన్న స్పోర్ట్స్ స్టేడియంలను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆత్మకూరు మండలంలో నూతన స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి జనార్దన్ రెడ్డిని కలిసి అనంతపురం బైపాస్ - కనగానపల్లి రోడ్డుకు రూ.30కోట్లు, కనగానపల్లి-చిగరచెట్టు రోడ్డుకు రూ.20కోట్లు, ధర్మవరం-కళ్యాణదుర్గం రోడ్డులకు రూ.22కోట్లు, అనంతపురం-చిగిచెర్ల రోడ్డుకు రూ.18కోట్లు మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి సంబంధిత పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు అని పరిటాల సునీత తెలియజేశారు

## హిందూపురం జిల్లా అదనపు కోర్టుకు బాంబు బెదిరింపు కలకలం



**హిందూపురం: ఫిబ్రవరి 24(జనసేన ప్రతినిధి)** హిందూపురం ఏ డి జే కోర్టులో బాంబు పెట్టినట్లు న్యాయమూర్తికి ఈ-మెయిల్ రావడంతో మంగళవారం కలకలం రేగింది. సమాచారం తెలుసుకున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు కోర్టు నుంచి బయటకు పరుగులు తీశారు .డీఎస్పీ కెవి మహేష్ ఆధ్వర్యంలో పట్టణ సీఐలు తమ సిబ్బందితో కలిసి వెంటనే అక్కడికి చేరుకున్నారు. బాంబు స్క్వాడ్ తనిఖీలు చేపట్టగా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు.భయాందోళనలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.గుర్తు తెలియని వ్యక్తులు వరుసగా మూడోసారి బాంబు బెదిరింపు ఈ-మెయిల్ పంపించినట్లు సమాచారం.కోర్టు అధికారులు బాంబు బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసారు.రజియా హుస్సేన్ పేరుతో జిల్లాలోని అన్ని కోర్టులకు బాంబు బెదిరింపు ఈ-మెయిళ్లు వచ్చాయని కోర్టు సిబ్బంది పేర్కొంటున్నారు.పోలీసులు కోర్టుల వద్ద డాగ్ స్క్వాడ్‌తో సోదాలు చేపట్టారు. మంగళవారం ఉదయం 11:55 కు ఆర్ డి ఎక్స్ బాంబు పేలుతుందని ఎల్ టి టి ఈ ఉగ్రవాద సంస్థ పేరిట కోర్టు సిబ్బందికి వచ్చిన మెయిల్ వచ్చినట్లు తెలిసింది.

## బెలుగుప్ప పంచాయతీ పారిశుద్ధ కార్మికులకు ఆరోగ్య రక్షణ కోసం సేఫ్టీ కిట్లను అందజేసిన సుజలాన్ సంస్థ...



**బెలుగుప్ప ( జనసేన ప్రతినిధి) ఫిబ్రవరి 24:** బెలుగుప్ప మండల కేంద్రంలోని స్థానిక పంచాయతీ కార్యాలయం నందు వెలుగుప్ప మండల ఎంపీడీవో లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో సుజలాన్ కంపెనీ ఆధ్వర్యంలో బెలుగుప్ప పంచాయితీ పారిశుద్ధ కార్మికులకు ఆరోగ్య రక్షణ కోసం సేఫ్టీ కిట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి నారాయణ మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులందరూ ఆరోగ్య రక్షణ కోసం ఈ సేఫ్టీ కిట్లను తప్పనిసరిగా ధరించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారికి తెలియజేశారు. అలాగే ఎక్స్ ఎన్ పి టి సి, వ్యవసాయ సంఘ చైర్పర్సన్ కంచి రాముడు మాట్లాడుతూ పరిశుభ్రత లక్ష్యంగా నిరంతరం విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులు మెరుగైన ఆరోగ్య రక్షణ కోసం వీటిని పంచడం జరుగుతుందని తెలిపారు. బెలుగుప్ప పంచాయతీ సెక్రటరీ మంజునాథ మాట్లాడుతూ పరిశుద్ధ కార్మికులందరూ బాధ్యతాయుగంగా పనిచేసి తద్వారా మన వెలుగుప్ప గ్రామపంచాయతీకి మంచి పేరు తేవాలని ఈ సుజలాన్ని కంపెనీ అందిస్తున్న రేడియం రక్షణ జాకెట్లు, గ్లౌజులు, సేఫ్టీ షూస్, మాస్కులు తదితర ఆరోగ్యకరమైన వస్తువులతో అందజేస్తున్న ఈ కిట్లను సుజలాన్ కంపెనీ అందజేస్తున్న సందర్భంలో వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వీటిని పారిశుద్ధ కార్మికులందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఏవో కృష్ణ నాయక్, బెలుగుప్ప పంచాయతీ సెక్రెటరీ మంజునాథ, సుజిలాన్ కంపెనీ కోఆర్డినేటర్ అమరేష్, సూపర్వైజర్ అంజి, బెలుగుప్ప పారిశుద్ధ కార్మికులు పాల్గొనడం జరిగింది.

## రోడ్ భద్రత పై వాహన చోదుకులు కు హెల్మెట్ ధరించడం గురించి అవగాహన కార్యక్రమము




**పెనుకొండ ఫిబ్రవరి 24(జనసేన ప్రతినిధి)** పెనుకొండ డీఎస్పీ మరియు పెనుకొండ సిఐ ఆధ్వర్యంలో పెనుకొండ ఎస్సై, సోమందేపల్లి ఎస్సై, రొద్దం ఎస్సై అలాగే పెనుకొండ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ తో కలిసి పెనుకొండ వై జంక్షన్ ఎన్ హెచ్ 44 నందు ప్రయాణం చేయు ద్విచక్ర వాహనదారులకు 15 హెల్మెట్స్ కొనుగోలు చేయించి హెల్మెట్ ధరించని వారికి అవగాహన ఏర్పరిచి హెల్మెట్ లేని వారికి కోనుగోలు చేయించి తగు జాగ్రత్తలు తీసుకోని ట్రాఫిక్ నియమాలు పాటించామని సూచించారు ఈ కార్యక్రమంలో పోలీసులు వాహాన చోదుకులు తదితరులు పాల్గొన్నారు

# ముదిగుబ్బలో కొత్త రుచుల సందడి...

**26న ఘనంగా 'హోటల్ రాఘవేంద్ర' ప్రారంభం**

**ఫ్లైఓవర్ సమీపంలో సకల సౌకర్యాలతో ఫ్యామిలీ రెస్టారెంట్ సిద్ధం**

**ప్రారంభోత్సవానికి పట్టణ ప్రజలందరికీ ఆహ్వానం**

**ముదిగుబ్బ ఫిబ్రవరి 24 :( జనసేన ప్రతినిధి )** మండల కేంద్రమైన ముదిగుబ్బ పట్టణంలో మరో కొత్త రుచుల నిలయం అందుబాటులోకి రానుంది. దొరిగల్లు రోడ్డులో ఫ్లైఓవర్ సమీపంలో, కదిరి బైపాస్ రోడ్డులో అన్ని హంగులతో నిర్మితమైన 'రాఘవేంద్ర ఫ్యామిలీ రెస్టారెంట్' ఈ నెల 26వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు ఘనంగా ప్రారంభం కానుంది.పట్టణ ప్రజలకు శుభ్రమైన వాతావరణంలో, కుటుంబ సమేతంగా ఆహ్లాదకరంగా భోజనం చేసే అవకాశాన్ని




కల్పించాలనే లక్ష్యంతో ఈ హోటల్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విశాలమైన కూర్చునే ఏర్పాట్లు, శుభ్రతకు ప్రాధాన్యత, పార్కింగ్ సదుపాయం, సమయపాలనతో సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఇక్కడ రుచికరమైన శాఖాహార, మాంసాహార వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఉదయం అల్పాహారాల నుంచి మధ్యాహ్నం, రాత్రి భోజనాల వరకు విభిన్న రకాల వంటకాలతో వినియోగదారుల మనసు దోచుకునేలా మెనూను సిద్ధం చేసినట్లు తెలిపారు. మంచి రుచి, సరసమైన ధరలు, మర్యాదపూర్వక సేవలు ఈ రెస్టారెంట్ ప్రత్యేకతగా నిలవనున్నాయి.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పట్టణ ప్రజలు, స్నేహితులు, వ్యాపార వర్గాలు, బంధువులు అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోషల్ మీడియా ద్వారా ఆహ్వానించారు."ఇదే మా పిలుపు... ప్రతి ఒక్కరూ తప్పక విచ్చేసి ఆశీర్వదించండి" అని నిర్వాహకులు కోరారు.ఆహ్వానించువారు: చల్లా బ్రదర్స్, ముదిగుబ్బ

## మహాశివరాత్రి ఉత్సవాల అనంతరం పెద్దమ్మ స్వామి హుండీ లెక్కింపు నిర్వహణ

**భక్తుల కానుకల వెల్లువ... రూ.53,476 నగదు, 630 గ్రాముల వెండి ఆభరణాలు లభ్యం**

**గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో పారదర్శకంగా లెక్కింపు**

**ముదిగుబ్బ ఫిబ్రవరి 24:( జనసేన ప్రతినిధి )** గ్రామ దేవతగా అపారమైన భక్తి విశ్వాసాలను పొందుతున్న పెద్దమ్మ స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉత్సవాలు ఈసారి కూడా ఘనంగా సాగాయి. నాలుగు రోజుల పాటు జరిగిన మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఉత్సవాలు ముగిసిన పది రోజుల అనంతరం ఆలయ వార్షికోత్సవ ఆదాయానికి సంబంధించిన హుండీ లెక్కింపును గ్రామ పెద్దలు మరియు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. హుండీ లెక్కింపులో మొత్తం రూ.53,476 నగదు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే భక్తులు అమ్మవారికి కానుకలుగా సమర్పించిన సుమారు 630 గ్రాముల వెండి ఆభరణాలు లభించాయి.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, సోమల ప్రకాష్ నాయుడు, కోట్ల బాబి, వేలూరు సూర్యనారాయణ, వెంకటనారాయణ పాల్గొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు



దామోదర రాజు, పూజారి పెద్దన్న పర్యవేక్షణలో లెక్కింపు పూర్తి చేశారు.ప్రస్తుత సంవత్సరానికి ఆలయ కమిటీ నూతన సభ్యులుగా దొండేటి రఘునాథ నాయుడు, నారాయణస్వామిని నియమించారు. ఆలయ అర్చకుడిగా మద్దినేని పెద్దన్న (తండ్రి పోతలయ్య) సేవలందిస్తున్నారు.భక్తుల విశ్వాసానికి నిదర్శనంగా హుండీ ఆదాయం, వెండి ఆభరణాల సమర్పణ నిలిచిందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో సౌభ్రాతృత్వం, శ్రేయస్సు నెలకొనాలని ఆకాంక్షించారు.

## చౌళూరు మధుమతిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పెనుకొండ నాయకులు

**హిందూపురం: ఫిబ్రవరి 24(జనసేన ప్రతినిధి)** హిందూపురం మండలం చౌళూరు గ్రామం నందు రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వారి కొడుకు వివాహానికి పెనుకొండ వైఎస్సార్సీపీ నాయకుడు బొమ్మిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మంగళవారం ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పెనుకొండ వైఎస్సార్సీపీ నాయకులు మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి ,సడ్లపల్లి తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గుడికట్ల పూజారులకు అండగా నిలవండి

**మంత్రి ఆనంతో మంత్రి సవిత**



**పెనుకొండ,( జనసేన బ్యూరో )ఫిబ్రవరి 24:** అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఎస్.సవిత కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాయలంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆమె మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుడికట్ల పూజారులకు సంబంధించిన సమస్యలపై దేవాదాయ శాఖ మంత్రి ఆనంతో మంత్రి సవిత చర్చించారు. రాష్ట్రంలో వ్యాప్తంగా 700ల వరకూ గుడికట్ల దేవాలయాలు ఉన్నాయన్నారు. వాటిలో ఉండే పూజారులు కురబ సామాజిక వర్గానికి చెందిన వారన్నారు. వారిని ఆదుకోవాల్సిన ఆశ్యకత ఉందన్నారు. దీనిలో భాగంగా వారికి గౌరవ వేతనం అందించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో చిన్న దేవాలయాలకు గౌరవం వేతనంతో పాటు ధూప, దీప, నైవేద్యాల కింద రూ.10 వేలు అందిస్తున్నారన్నారు. వారికి మాదిరే గుడికట్ల దేవాలయాల నిర్వహణకూ రూ.10 వేలు చొప్పున అందించాలని మంత్రి సవిత కోరారు. గుడికట్ల పూజార్ల సమస్యలపై మంత్రి ఆనంకు వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించారు. గుడికట్ల పూజార్ల సమస్యల పరిష్కారానికి అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట రాష్ట్ర కురుబల సంక్షేమ సంఘం, గుడికట్ల దేవాలయ పూజారుల ప్రతినిధులు ఉన్నారు.

## ఐసిడిఎస్ సంస్థ పరిరక్షణకు కోసం నిధులు కేటాయించండి..

**రెండవ రోజు కొనసాగిన అంగన్వాడీల రిలే దీక్షలు..**




**సోమందేపల్లి,జనసేనప్రతినిధి,ఫిబ్రవరి24:**సోమందేపల్లి మండల కేంద్రంలోని సిడిపిఓ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్ రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కారం చేయాలి,సమ్మె ఒప్పందాలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఐసిడిఎస్ సంస్థ పరిరక్షణ కోసం నిధుల కేటాయించి సమ్మె ఒప్పందాల అమలుకు నిధులు కేటాయించాలని లేనిపక్షంలో రాబోవు కాలంలో అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు అనంతరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సుదీర్ఘమైన పోరాటాలు నిర్వహిస్తామని ఇందుకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మాబు,మండల కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ , రవి,కుమ్మర కిష్టప్ప, నాగభూషణ,సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండా వెంకటేష్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నందీశ్వర ఆలయ ప్రతిష్టా, కుంభాభిషేక మహోత్సవాలు



(జనసేన ప్రతినిధి)వేంపల్లె, **ఫిబ్రవరి:24** మండలంలోని నందిపల్లె గ్రామంలో రూ.6 కోట్లతో నూతనంగా నిర్మించిన శ్రీ నందీశ్వర ఆలయ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా కొనసాగుతునాయని ఆలయ ఛైర్మన్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా వేద పండితుల నేతృత్వంలో గణపతి పూజ, యగశాల ప్రవేశం, కలశ స్థాపన, అంకురార్పణ, అగ్నిప్రతిష్ట, దీక్షాహోమం, వాస్తు హోమం, చండీ యాగం తదితర పూజా కార్యక్రమాలు వైదిక పండితులు నిర్వహించారన్నారు. 26వ ఉదయం 11.38నిమిషములకు కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామివారిచే ఆలయ కుంభాభిషేకం జరుగుతుందని వేద పండితులు తెలిపారు. ఆలయ ఛైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 5 రోజుల పాటు భక్తులకు అల్పాహారం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు వీక్షించారు. వేంపల్లె మండల ప్రజలు నందీశ్వరుడి ప్రతిష్టా కార్యక్రమాల్లో పాల్గొని కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 క్రీడల్లో అద్భుతంగా రాణించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి.



**పుట్టపర్తి (జనసేన ప్రతినిధి)** ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్ మీట్ 2026 లో ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు మూడు రోజులు పాటు విజయవాడ వేదికగా ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం మహిళా ఎమ్మెల్యేలకు నిర్వహించిన క్రీడల పోటీల్లో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే సింధూర రెడ్డి అద్భుతంగా రాణించారు. పరుగు పందెంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మిగతా మహిళా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలతో నిర్వహించిన వారిలో గ్రీష్మ , శ్రావణి , భూమా అఖిలప్రియలు పోటీపడ్డారు. ఈ పరుగు పందెంలో మొదటి స్థానం మహిళా ఎమ్మెల్సీ గ్రీష్మ ,రెండవ స్థానంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నిలిచారు. టగ్ ఆఫ్ వార్ క్రీడలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు నాయకత్వంలో ఆడిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల జట్టు విజయం సాధించింది. ఈ విజయం సాధించిన క్రీడా జట్టులో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కూడా ఉన్నారు.

# ఆర్డీటీ పరిరక్షణకు 'పోస్టు కార్డు' ఉద్యమం

**'సేవ్ ఆర్డీటీ' పేరుతో లక్షమందితో ప్రధానికి పోస్టుకార్డులు**

**మార్చి 10న కుందుర్పిలో లాంఛనంగా ప్రారంభం**

**ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయాలి**



**అనంతపురం జనసేన ప్రతినిధి ఫిబ్రవరి 24:**వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య డిమాండ్.ఆర్డీటీ సంస్థ పరిరక్షణ కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టనున్నట్లు వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ప్రకటించారు. మార్చి 10వ తేదీన కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పిలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఆర్డీటీ అనేది ఒక వరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదల అభ్యున్నతి, విద్య, వైద్యం, క్రీడలు, మహిళా సాధికారతలో ఆర్డీటీ సేవలు అందించిందని తెలిపారు. కేంద్రం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయకపోవడంతో గతంలోనే పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆర్డీటీ సేవలు అందిస్తోందన్నారు. ప్రజా సంఘాలతో పాటు అనేక రాజకీయ పార్టీలు ఆర్డీటీకి అండగా నిలిచాయన్నారు. ప్రతి కార్యక్రమానికి వైఎస్ఆర్‌సీపీ మద్దతుగా నిలవడమే కాకుండా భాగస్వామ్యం కూడా అయ్యిందని గుర్తు చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం సమన్వయకర్త రంగయ్య నాయకత్వంలో బైక్ ర్యాలీ, పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వాలకు సమాంతరంగా ఆర్డీటీ సేవలు అందించిందని, అలాంటి సంస్థ మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి వచ్చిందన్నారు. ఓ వైపు ఉద్యమాలు జరుగుతుంటే మరోవైపు అధికార పార్టీ నేతలు మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంతో మాట్లాడాం అని.. స్వయంగా కళ్యాణదుర్గంలో కనకదాస విగ్రహావిష్కరణకు వచ్చిన నారా లోకేష్ కూడా ఆర్డీటీ విషయంలో హామీ ఇచ్చారన్నారు. గతంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ కూడా ఆర్డీటీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారని తెలిపారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం ఎమ్మెల్యేలు కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లాం.. న్యాయం జరుగుతుందని చెబుతూ పత్రికల్లో వార్తలు రాయించుకోవడం మినహా ఒరిగిందేమీ లేదని చురకలంటించారు. ప్రస్తుతం ఆర్డీటీ సేవలు అందించలేక ఆస్తులు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇక్కడ ఆర్డీటీ లేకపోతే ఆ సంస్థకు వచ్చే నష్టం ఏమీ లేదని, అంతిమంగా ప్రజలు నష్టపోతారని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆర్డీటీ పరిరక్షణ కోసం వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో 'సేవ్ ఆర్డీటీ' పేరుతో లక్ష మందితో పోస్టు కార్డులను ప్రధాని నరేంద్రమోదీకి పంపనున్నట్లు ప్రకటించారు. ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవద్దని సూచించారు. మతాన్ని బూచిగా చూపి ఆర్డీటీని అడ్డుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**మూతపడే స్థితిలో ఆర్డీటీ**

ఆర్డీటీ సంస్థ మూతపడే స్థితిలో ఉందని కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే 2025 ఏప్రిల్ నుంచే ఆర్డీటీ సంస్థకు చెందిన అకౌంట్లు ఫ్రీజ్ అయ్యాయన్నారు. వైఎస్ఆర్‌సీపీ హయాంలో ఆర్డీటీకి ఎలాంటి ఇబ్బందులు కలగలేదని చెప్పారు. ఆర్డీటీ కోసం తాము పాదయాత్ర చేస్తే విమర్శలు చేశారని, ఆర్డీటీ విషయంలో తాము రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. ఆర్డీటీ అనేది ఒక కులం, మతానికి సంబంధించిదని కాదని.. ఇక్కడి ప్రజలకు సంబంధించినది తెలిపారు. ఇక్కడ త్రిబుల్ ఇంజన్ సర్కార్ ఉందని... మంత్రులు సత్యకుమార్, పయ్యావుల కేశవ్, అహుడా చైర్మన్ ఉన్నా ఎందుకు నచ్చజెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. చివరకు ఆర్డీటీ సంస్థ క్రెడిబులిటీని ప్రభుత్వమే దెబ్బతీస్తోందన్నారు. మార్చి 10వ తేదీన కుందుర్పిలో 'సేవ్ ఆర్డీటీ' పేరుతో నాలుగు భాషల్లో ప్రధాని మోదీకి లక్ష పోస్టుకార్డులు పంపే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అప్పటిలోగా ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆర్డీటీ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నిధులపై ఫ్రీజ్ ఎత్తివేయాలన్నారు.

# శ్రీ కాటకోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో వైభవం...

**ధర్మవరం డిఎస్పీకి ఘన సన్మానం**

**పటిష్ట బందోబస్తుతో ప్రశాంతంగా ఉత్సవాలు...**

**పోలీసుల సేవలకు గ్రామస్తుల కృతజ్ఞత**

**శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించిన పోలీసులకు అభినందనలు**



**ధర్మవరం, ఫిబ్రవరి 24:( జనసేన ప్రతినిధి)** తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కాటకోటేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.వేలాదిగా తరలివస్తున్న భక్తులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది.ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, భక్తుల రాకపోకల పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ఈ నేపథ్యంలో ధర్మవరం డిఎస్పీ హేమంత్ కుమార్ నేతృత్వంలో పోలీసు బలగాలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు ప్రశాంతంగా సాగేందుకు కృషి చేశారు. పోలీసుల అప్రమత్తతతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకునే అవకాశం లభించిందని గ్రామస్తులు తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణలో ప్రత్యేక చొరవ చూపిన డిఎస్పీ హేమంత్ కుమార్‌ను చిల్లవారిపల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. దుశ్శాలువాతో కప్పి, పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల సేవాభావం, క్రమశిక్షణ, సమయపాలనను గ్రామ పెద్దలు కొనియాడారు.ఈ సందర్భంగా డిఎస్పీ హేమంత్ కుమార్ మాట్లాడుతూ:భక్తుల భద్రతే తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు.ఉత్సవాలు విజయవంతం కావడంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ, స్వచ్ఛంద సేవకుల సహకారం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాల్లో పోలీసులు అప్రమత్తంగా సేవలు అందిస్తారని స్పష్టం చేశారు.బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ విజయవంతంగా కొనసాగుతుండగా, గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

# గ్రామాల నుంచి గెలుపు దిశగా బీజేపీ పావులు...

**ముక్తాపురంలో కిసాన్ మోర్చా కమిటీలు ఏర్పాటు**

**స్థానిక ఎన్నికల లక్ష్యంగా కట్టుదిట్టమైన నిర్మాణం...**

**రైతుల ఏకీకరణకు నాయకుల పిలుపు**

**పార్టీ బలోపేతమే ధ్యేయంగా గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రారంభం**



**ముదిగుబ్బ ఫిబ్రవరి 24:( జనసేన ప్రతినిధి):**గ్రామాల నుంచే పార్టీని బలపరచాలనే సంకల్పంతో ముక్తాపురం పంచాయతీలో కిసాన్ మోర్చా గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. రైతుల సమస్యలను ముందుకు తీసుకెళ్లడమే కాకుండా, వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి బాటలు వేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో బలమైన కమిటీలు ఉంటేనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.రైతుల ఆశలు, ఆవేదనలు పార్టీ వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కిసాన్ మోర్చా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో చురుకుగా పనిచేసి పార్టీ పతాకాన్ని ఎగరవేయాలని పిలుపునిచ్చారు.ఇటీవల రాష్ట్ర పర్యటనలో భాగంగా చిగురుపాటి కుమార్ స్వామి సత్యసాయి జిల్లాను సందర్శించి, పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన సూచనల మేరకు జిల్లాలో గ్రామ స్థాయిలో కమిటీలను నిర్మించుకోవడం ప్రారంభించామని తెలిపారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని నాయకులు సూచించారు.జిల్లా ఉపాధ్యక్షులు జయచంద్ర రెడ్డి, పసుపులేటి వెంకటేష్, జిల్లా కార్యదర్శి జాస్తి అశోక్ మాట్లాడుతూ, రైతుల శక్తి ఏకం అయితే పార్టీకి అపార బలం చేకూరుతుందని అన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మీపతి నాయుడు, ప్రతాప్ నాయుడు, చంద్రమోహన్, నాగరత్నం నాయుడు, కేశవ నాయుడు, కుల్లాయప్పతో పాటు పలువురు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.గ్రామ స్థాయిలో ప్రారంభమైన ఈ కమిటీలు పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయని, భవిష్యత్ రాజకీయ పోరాటాలకు ఇది బలమైన అడుగుగా మారుతుందని కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేశారు.

## డబ్బుంటే కాదు... సహాయం చేసే మనసుంటే చాలు......

**విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటుచేసిన పాఠశాల నైట్ వాచ్మెన్ ఫక్రుద్దీన్......**



**గోరంట్ల, (జనసేన ప్రతినిది ) ఫిబ్రవరి, 24:** ఎదుటివారికి సహాయం చేయాలంటే డబ్బు ఉంటే మాత్రమే కాదు, సహాయం చేసే మంచి మనసు కూడా అవసరమని గోరంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నైట్ వాచ్మెన్ ఫక్రోద్దీన్ నిరూపించారు. గోరంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది విరాళాలతో ప్రతిరోజు సాయంత్రం విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు నైట్ వాచ్మెన్ ఫక్రోద్దీన్ పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. తన మంచి మనస్సు ను చాటు కున్నారు. చిన్న ఉద్యోగంలో ఉన్నప్పటికీ విద్యార్థుల పట్ల ప్రేమాభిమానంతో ముందుకు వచ్చి సేవ చేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర్ ప్రసాద్ మరియు అధ్యాపక బృందం ఆయను అభినందించారు.

## నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ దేవాలయానికి విరాళం అందించిన సర్పంచ్ మండల కన్వీనర్.....



**గోరంట్ల, (జనసేన ప్రతినిది ) ఫిబ్రవరి 24:** గోరంట్ల మండల పరిధిలో పూలేరు పంచాయతీలో మారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి విరాళం అందించిన, గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ సరోజ నాగే నాయక్, 10.000, టీడీపీ మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి 5000 రూపాయలను. ఆలయ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమం లో టీడీపీ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్ నరసింహాప్ప గౌనివారిపల్లి సింగల్ విండో అధ్యక్షులు రవి మోహన్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రవి నాయక్, ప్రకాష్ హరీష్ రెడ్డి, త్యాగరాజు అది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పుష్ప స్టైల్‌లో మట్టి మాఫియా రెచ్చిపోతోందా..?

### అధికారుల నిర్లక్ష్యంపై టౌన్‌లో చర్చ"- రేగు మహేశ్వరరావు సాలూరు జనసేన నాయకుడు





**సాలూరు, జనసేన ప్రతినిధి:** ఆ మధ్య విడుదలైన ్రాబంప్త్రజూఖు: ుప్త్రవ =అంవ సినిమా తరహాలో సాలూరు నియోజకవర్గ పరిధిలో మట్టి మాఫియా జోరుగా కొనసాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "మమ్మల్ని ఎవరు ఆపగలరు?" అన్నట్టుగా మూడులారీలు, ట్రాక్టర్లలో బహిరంగంగా మట్టిని తరలిస్తూ దందా సాగిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
నియోజకవర్గం చుట్టుపక్కల గ్రామాల్లో చెరువులు, చెరువు పోరంబోకు, గెడ్డ పోరంబోకు భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం. కొండప్రాంతాల్లో కంకర, వాగుల్లో ఇసుక తవ్వకాలు కూడా అనుమతులు లేకుండా జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ, మైనింగ్, రవాణా శాఖల అధికారులకు విషయం తెలియజేసినా చర్యలు ఆలస్యం అవుతున్నాయనే టాక్ నడుస్తోంది. ప్రత్యేకంగా టౌన్ పరిధిలో జీగిరాం జాతీయ రహదారి మీదుగా లారీల్లో మట్టి తరలింపులు జరుగుతుండటం, ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న రహదారి మీదుగా బహిరంగంగా మట్టిని తీసుకెళ్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కొంతమంది అధికారులకు మామూలు ఇచ్చి మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై **అధికారికంగా ఎటువంటి ధృవీకరణ లేదు.**
ప్రభుత్వ భూముల్లో మట్టి, ఇసుక, కంకర తవ్వకాలకు రెవెన్యూ మరియు భూగర్భ ఘనుల (మైనింగ్) శాఖల అనుమతులు తప్పనిసరి. అలాగే ప్రైవేట్ జీరాయితీ భూముల్లో కూడా సంబంధిత శాఖల నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ అవసరం. ఈ నిబంధనలు ఉన్నప్పటికీ "ఐ డోంట్ కేర్" ధోరణిలో తవ్వకాలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
**పబ్లిక్ టాక్:** ప్రభుత్వ ఆదాయం అంటే ప్రజల ధనం. అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతోందని, మట్టి-ఇసుక-కంకర మాఫియాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
**ఎమ్మార్వో స్పందన:** ప్రభుత్వ భూముల్లో ఎటువంటి తవ్వకాలు పూర్తిగా నిషేధమని పట్టణ తహసీల్దార్ నీలకంఠరావు స్పష్టం చేశారు. మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. అక్రమ తవ్వకాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, సిబ్బందిని అప్రమత్తం చేశామని ఆయన మీడియాకు వెల్లడించారు.
అక్రమ మట్టి తవ్వకాలపై త్వరితగతిన చర్యలు తీసుకుని మాఫియా ఆటలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# అంగన్వాడీ కార్యకర్తల సమస్యలపై మంత్రి సంధ్యారాణి భేటీ

### డిమాండ్లను పరిశీలిస్తామని హామీ -- సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం



**సాలూరు, జనసేన ప్రతినిధి :** అంగన్వాడీ సంఘాల ప్రతినిధులతో రాష్ట్ర మంత్రి సంధ్యారాణి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలను మంత్రి శ్రద్ధగా ఆలకించారు. వేతనాలు, భత్యాలు, పదవీ భద్రత, పదోన్నతులు, సౌకర్యాల మెరుగుదల తదితర అంశాలపై సంఘాల ప్రతినిధులు తమ డిమాండ్లను వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు గ్రామీణ స్థాయిలో మహిళా, శిశు సంక్షేమానికి చేస్తున్న సేవలను మంత్రి అభినందించారు. వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, సాధ్యమైన పరిష్కారాల కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంగన్వాడీ కార్యకర్తల సంక్షేమం విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి గౌరవం, భద్రత, ఆర్థిక స్థితి మెరుగుపర్చే దిశగా చర్యలు కొనసాగుతాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ భేటీతో అంగన్వాడీ కార్యకర్తల్లో ఆశావహ వాతావరణం నెలకొంది. సంఘాల ప్రతినిధులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# జమ్మలబండ లో ఘనంగా జాతర మహోత్సవం....

### 5. మండలాల విలేకరులును ఆహ్వానించిన గోవిందరాజు...



**గుడిబండ, (జనసేన ప్రతినిధి) ఫిబ్రవరి 24:** గుడిబండ మండలంలోని జమ్మలబండ గ్రామ పంచాయతీ పరిధిలో జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జమ్మల బండ గ్రామపంచాయతీ చెందిన జనసేన దినపత్రిక విలేఖరి గోవిందరాజు ప్రత్యేకంగా మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల విలేకరులను ఆహ్వానించారు. ఆహ్వానిత విలేకరులను గౌరవిస్తూ, గోవిందరాజు తన నివాసం వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో స్థానిక సమస్యలు, ప్రజా అవసరాలు, గ్రామ అభివృద్ధి అంశాలు చర్చకు వచ్చాయి. ఐదు మండలాల విలేకరులు ఒకే వేదికపై కలవడం ద్వారా గ్రామస్థాయిలో జరుగు జాతరలకు మీడియా ప్రాధాన్యం మరింత పెరిగింది. గ్రామ ప్రజలు విలేకరుల సమక్షంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, గోవిందరాజు వారిని సత్కరించి, స్థానిక పత్రికా రంగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తు చేశారు.

# ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు అన్నదానం..

### అన్నదానం చేసిన మేస్త్రి అక్రమ్ బాషా...

**సోమందేపల్లి, జనసేనప్రతినిధి,ఫిబ్రవరి24:** సోమందేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు అన్నదానం చేసారు ముస్లిం మైనారిటీ సోదరులు,గత సంవత్సరం రంజాన్ మాసం లో మొదలైన ఈ అన్నదాన కార్యక్రమం మంగళవారం నాటికీ సంవత్సరం పూర్తి చేసుకుంది,ఈ సందర్బంగా జామియా మజీద్ కార్యదర్శి,మేస్త్రి అక్రమ్ బాషా ఆధ్వర్యంలో జామియా మజీద్ ముతువల్లి మహమ్మద్,మేస్త్రి చాంద్ బాషా,మాసూద్ సమక్షంలో, ప్రభుత్వ వైద్యులు ఓంకార్ చేత గర్భిణీ స్త్రీలకు అన్నదానం చేసారు,ఈ అన్నదానం ఇలాగే కొనసాగుతుందని ముస్లిం మైనారిటీ సోదరులు తెలిపారు,ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర, పీహెచ్ఎన్ ప్రభావతమ్మ, వెల్డింగ్ షాప్ సెక్షావలి,ఆశ వర్కర్స్ పాల్గొన్నారు...

# పల్నాడు జిల్లా డైరీ ప్రజలకు ఎంతో ఉపయోగకరం: పల్నాడు జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా





పల్నాడు జిల్లా వ్యాప్తంగా అధికారుల సమాచారం "పల్నాడు జిల్లా డైరీ"ద్వారా ప్రజలకు చేర్చడం శుభపరిణామం: నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు **నరసరావుపేట, ఫిబ్రవరి 24,జనసేన ప్రతినిధి:** పల్నాడు జిల్లా డైరీ ప్రజలకు ఎంతో ఉపయోగకరం అని పల్నాడు జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అన్నారు. ఈ రోజు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట లోని పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ రూపొందించిన పల్నాడు జిల్లా డైరీ ను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఆవిర్భావం నుండి ఇప్పటివకు ప్రతి సంవత్సరం జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య అధికారుల వివరాలు తదితర సమాచారం పల్నాడు జిల్లా డైరీ లో పొందుపరచడం సంతోషదాయకమన్నారు. పల్నాడు జిల్లా డైరీ ను రూపొందించిన తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ ను అభినందించారు. అనంతరం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పల్నాడు జిల్లా డైరీని ఆవిష్కరించి ప్రజలకు అధికారుల సమాచారం తెలియడం వలన ప్రజలు వివిధ సమస్యలపై సంబంధిత అధికారులను సంప్రదించి ఆయా సమస్యలు పరిష్కరించుకుంటారని పల్నాడు జిల్లా డైరీని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని పల్నాడు జిల్లా డైరీని రూపొందించిన ప్రముఖ న్యాయవాది,తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ ను అభినందించారు. అనంతరం గోదా రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలాగా పనిచేస్తూ పల్నాడు జిల్లా అభివృద్దే ధ్యేయంగా భావించి"పల్నాడు జిల్లా డైరీ"ను రూపొందించి పల్నాడు జిల్లా ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం సరికొత్త సమాచారంతో ప్రజలకు ఎంతో ముఖ్యమైన సమాచారంతో పల్నాడు జిల్లా డైరీని రూపొందించామని పల్నాడు జిల్లా అభివృద్ధికి తమవంతు కృషి ఎప్పుడూ ఉంటుందని రమేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. రామ్ ప్రసాద్, టీడీపీ నాయకులు వెన్నా రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వమే జనసేన బలానికి పునాది దిశానిర్దేశం

### కార్యకర్తల సమావేశంలో జనసేన నేత సుంకర శ్రీనివాస్



**వైయస్సార్ కడప జిల్లా: ఫిబ్రవరి:24 (జనసేన ప్రతినిధి)** జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటర్ మరియు కడప అసెంబ్లీ ఇంచార్జ్ సుంకర శ్రీనివాస్అధ్యక్షతన, అహుడా చైర్మన్ మరియు జనసేన పార్టీ "ఉద్యమి" సభ్యత్వ నమోదు కడప పార్లమెంట్ సమన్వయకర్త ౦.జ. వరుణ్ సమక్షంలో, జనసేన పార్టీ "ఉద్యమి" సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించి ఒక ముఖ్యమైన సన్నాహక సమావేశం జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో అధ్యక్షత వహించిన సుంకర శ్రీనివాస్ విస్తృతంగా మాట్లాడారు. "ఉద్యమి" సభ్యత్వ నమోదు కార్యక్రమం జనసేన పార్టీ భవిష్యత్తును నిర్ణయించే కీలక అంశమని పేర్కొంటూ,కడపపార్లమెంటరీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం పటిష్టంగా అమలవ్వాలని స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గం, ప్రతి డివిజన్ స్థాయిలో ఉద్యమి సభ్యత్వం విస్తరించాలంటే నాయకులు, కార్యకర్తలు బాధ్యతతో, సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఉద్యమి సభ్యత్వ నమోదు జరగాలని, ఈ కార్యక్రమం ద్వారా జనసేన పార్టీ ప్రజల్లో మరింత బలంగా నిలబడుతుందని సుంకర శ్రీనివాస్అన్నారు. ఈ సందర్భంగా టీ సి వరుణ్ మాట్లాడుతూ, ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణ, అవసరమైన సూచనలు వివరించారు. అన్ని నియోజకవర్గాలసమన్వయంతోపనిచేస్తేఉద్యమికార్యక్రమంవిజయవంతమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కడప పార్లమెంటరీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల పిఓసిలు మరియు ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమాజ మార్పే లక్ష్యం- జనసేనతో ముందుకు!

### గ్రామం నుంచి నియోజకవర్గం వరకు బలోపేతం... ఫిబ్రవరి 26 నుంచి సభ్యత్వ మహా డ్రైవ్‌కు సైనికులు సిద్ధం



**సాలూరు, జనసేన ప్రతినిధి:** జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం (ఉద్యమి) ఫిబ్రవరి 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో సాలూరు నియోజకవర్గంలో విస్తృత స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. ఈ కార్యక్రమం కేవలం సభ్యత్వ నమోదు మాత్రమే కాకుండా, పార్టీ బలోపేతానికి, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు శక్తివంతమైన నిర్మాణానికి బాటలు వేయనున్న ఉద్యమంగా పార్టీ నేతలు పేర్కొన్నారు. సాలూరు నియోజకవర్గంలోని జనసైనికులు, వీర మహిళలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి సభ్యత్వాలు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే సభ్యత్వం పొందిన వారు తమ పాత మెంబర్షిప్‌ను తప్పనిసరిగా రీన్యువల్ చేసుకోవాలని, కొత్తగా చేరదలచిన వారు నూతన సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామం, వార్డు, మండల స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు కోసం సాధక్ (క్రియా వాలంటీర్)లను లేదా తమ తమ మండల నాయకులను సంప్రదించాలని తెలిపారు. త్వరలోనే ప్రతి ప్రాంతానికి సంబంధించిన వాలంటీర్ల పూర్తి వివరాలు ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని సాలూరు జనసేన అధ్యక్షులు, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ నాయకులు శివకృష్ణ తెలిపారు. జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్రియాశీలక సభ్యుల పాత్ర అత్యంత కీలకమని ఆయన అన్నారు. ప్రతి జనసైనికుడు కనీసం పదిమందిని సభ్యులుగా చేర్చే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం సాధక్‌లుగా మారి సభ్యత్వాలు నమోదు చేసుకునేందుకు సోషల్ మీడియా కోఆర్డినేటర్ లావేటి లీలా కృష్ణ (85007 87578), సాలూరు పట్టణ నాయకులు మీసాల నవీన్ కుమార్ (9966273133)లను సంప్రదించవలసిందిగా కోరారు. "పార్టీ బలోపేతం -- ప్రజల హక్కుల సాధనం" అనే నినాదంతో సాగనున్న ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి జనసైనికుడు సేనా సిద్ధం కావాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది.

# వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలి

### ద్విచక్ర వాహనాలతో ప్రతిజ్ఞ చేయించిన డి.ఎస్.పి మహేష్



**హిందూపురం/లేపాక్షి: ఫిబ్రవరి 24(జనసేన ప్రతినిధి)** జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె.వి. మహేష్ మంగళవారం హిందూపురం రూరల్ సీఐ కె.జనార్ధన్ తోకలిసి లేపాక్షి పోలీస్ స్టేషన్ పరిధిలోని చోళసముద్రం టోల్ ప్లాజా రోడ్డుపై ప్రత్యేక వాహన తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. లేపాక్షి ఎస్ఐ నరేంద్ర మరియు పోలీసు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేవీ మహేష్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులకు హెల్మెట్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపితే జరిగే ప్రమాదాలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ఎంత కీలకమైన పాత్ర పోషిస్తుందో స్పష్టంగా తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసి, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. తప్పకుండా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రాణ రక్షణకే హెల్మెట్ ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, వాహన చోదకులు తది తరులు పాల్గొన్నారు

# ఇంటర్మీడియట్ పరీక్షల పటిష్ట పోలీసు బందోబస్తు

### ;ఎస్సై నాగ మధు




**కణేకల్లు జనసేన ప్రతినిధి ఫిబ్రవరి 24:** కణేకల్ పట్టణంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు అవాంఛనీయ ఘటనలు లేకుండా జరగేలా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ పి జగదీశ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో అనధికార వ్యక్తులు గుమిగూడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద , ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బందిని నియమించి, పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు లేదా నిషేధిత వస్తువులు తీసుకురాకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా ప్రశ్నాపత్రాల రవాణా మరియు భద్రత కోసం ప్రత్యేక పోలీసు ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఎగ్జామ్స్ సెంటర్ల పరిసర ప్రాంతాలలో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై నాగమధు తెలిపారు.

జనసేన


## ఇంటర్, 10వ తరగతి పరీక్షలను పకడిబందిగా నిర్వహించాలి

**సీఎస్ కె.రామ కృష్ణ రావు**

నేటి నుంచి మార్చి 18 వరకు ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణపరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి.ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలి.పరీక్షా సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి10వ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎస్.. ఇంటర్ పరీక్షలను రాష్ట్రంలో కట్టుదిట్టంగా నిర్వహించాలని సి.ఎస్.కె. రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఎస్ కె.రామ కృష్ణ రావు ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ కె.రామ కృష్ణ రావు మాట్లాడుతూ. నేటి నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాలకు ఎవరికీ సెల్ ఫోన్ తీసుకుని రావడానికి అనుమతి లేదని, సీసీ కెమెరాల సమక్షంలోనే ప్రశ్నాపత్రాలు సీల్ ఓపెన్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రవేశద్వారం వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని,పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

## బపర్ జోన్ పేరుతో ఇండ్ల తొలగింపును ఆపాలి

**సీపీఐ (ఎమ్ఎల్) సీపీ రెడ్డి పార్టీ**

**జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్**

**హైదరాబాద్ :** మూసి సుందరీకరణలో భాగంగా బపర్ జోన్ పేరుతో పేదల ఇండ్లను కూల్చాడ నీ తక్షణమే నిలిపి వేయాలని సీపీఐ ( ఎమ్ ఎల్) సీపీ రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం న్నీ డిమాండ్ చేశారు ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు ' మూసి నది మురికి కూపంగా మారిన నేపద్యంలో ప్రక్షాళన, నిజమైన నిజమైన పునర్జీవం జరగాలని హైదరాబాద్ ప్రజలు కోరుకుంటున్నారు,కానీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చూస్తుంటే ప్రక్షాళన కంటే సుందరీకరణ,రియల్ ఎస్టేట్,టూరిజం వ్యాపారికరనే కె ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం అవుతున్నది అని మూసి నదికి ఇరు వైపుల 50 మీటర్ల వరకు " బపర్ జోన్" పేరుతో దశద్బులుగా నివసిస్తున్న ప్రజల ఇండ్లను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధపడటం అన్యాయమైనది , ప్రభుత్వ అనుమతులతో నిర్మించుకున్న ఇండ్లను ఇపుడు అక్రమంగా ఎలా ప్రకటిస్తారు? బపర్ జోన్ లో ఉంటే గతంలో అనుమతులు ఎలా ఇచ్చారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఏక పక్షంగా కూల్చివేతలు చేపట్టడం ప్రజాస్వామ్య విరుద్ధం అని పేర్కొన్నారు, మూసి నది వరదలతో ఏనాడు మునిగి పోనీ బస్తీలు,కాలనీలను ఈ ప్పుడు తొలగించాల్సిన అవసరం ఏమొచ్చింది? గరిష్ట నది ప్రవాహ మట్టం వివరాలను ఎందుకు ప్రజలకు వెల్లడించడం లేదు? అని నిలదీశారు" గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ ' రీ వర్ ఫ్రోంట్ డెవలప్మెంట్" పేర్లతో పేద ప్రజల ను నిరశ్రేయుల్ని చేసి, ఆ భూములను ,టూరిజం,ప్రవేట్ ప్రాజెక్టు లకు కట్ట బట్టే ప్రయత్నని విరమించుకోవాలని డిమాండ్ చేశారు, గుజరాత్ లోని సబర్మతి నది అభివృధి నమూనతో వేలాది పేదలను అక్కడ నుండి తరిమేసి నారు,అక్కడి పరిస్థితి హైదరాబాద్ ప్రజల కు రాబోతున్నది కావున రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెన్నకి తీసుకోవాలని డిమాండ్ చేశారు ,ఆ ప్రాజెక్ట్ డీ పి ఆర్ , ఎమ్ ఎఫ్ ఎల్ వివరాలను బహిర్గతం చెయ్యాలని కోరారు మూసి నది పరివాహక ప్రజల శాశ్వత పరిష్కారం తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షం లో మూసి బాదితుల పక్షాన ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు

## డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట :** రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన 'ఏరైవ్ అలైవ్ ' 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ మరియు పోలీస్ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, ముఖ్యంగా డ్రైవర్లకు కలర్ బ్లైండ్, వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం జరుగుతుంది అని అలాంటి వారికి చికిత్స ద్వారా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని తగిన జాగ ముఖ్యంగా డ్రైవర్లకు సమస్యలు లేకుండా కంటి చూపు సక్రమంగా ఉండటం అత్యవసరమని తెలిపారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఆటో, టాక్సీ డ్రైవర్కు కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడమే కాకుండా, తగిన చికిత్సలు కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందించబడతాయని ఎస్పీ వివరించారు. డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై పలు ముఖ్య సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలను పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, కారులో సీట్ బెల్ట్ మరియు ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదని, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్యూసీ, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని, బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని ఎస్పీ పేర్కొన్నారు.

ఈ శిబిరం ద్వారా మొత్తం 70 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## దళితులు ఇంటి స్థలాలను. స్మశాన వాటిక భూములను భూ కబ్జాదారులు నుండి కాపాడండి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ

**రాజంపేట/ చిట్వేలి ఫిబ్రవరి, 24. (జనసేన ప్రతినిధి)** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చిట్వేలిమండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం దళితవాడ గ్రామ స్థలాన్ని పరిశీలన చేసి. మండల తాసిల్దార్ కార్యాలయం దగ్గర నిరస తెలిపి తాసిల్దారు గారికి వినతి పత్రం అందజేయడం జరిగినది . ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య. డి హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు దార్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ తుమ్మ కొండ పంచాయతీ అరుంధతి వాడ గ్రామం లో 20 కుటుంబాల వారు నివసిస్తూ ఉండారు. ఒక్కొక్క కుటుంబంలో మూడు రెండు ఫ్యామిలీలు నివసిస్తూ అతి కష్టం మీద జీవిస్తూ ఉన్నారని పేదవారికి కూటికోసం రెండు ఎకరాలు బంజరు భూమి గుడి కోసం.మూడు సెంట్లు ఇంటి స్థలం అవసరమని అన్నారు. తుమ్మకొండ దళిత గ్రామనత్తం. మరియు స్మశాన వాటిక. మరియు గ్రామ వసతులకు గ్రామం పక్కనే ఉన్నటువంటి భూమిని ఒక అగ్రవర్ణ కులానికి చెందినవారు ఆ భూమి పై తన్నేసి మాది అని దళితులను ఇండ్లు కట్టనివ్వకుండా. స్మశాన వాటికిని గ్రామ కంటాన్ని పూర్తిగా





కబ్జా చేసి దళితులు అడిగితే వాళ్లను నానా బూతులు తిడుతూ చంపేస్తామని భయ ప్రాంతానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు

**దళితులను భయ ప్రాంతానికి**

గురిచేస్తున్నటువంటి భూకబ్జాదారుల పైన వెంటనే రెవిన్యూ తాసిల్దార్ గారు విచారణ జరిపి వారిపై సట్టా పరమైన చర్యలు తీసుకొని దళితవాడకు సంబంధించినటువంటి స్థలాన్ని దళితవాడకే కేటాయించి తుమ్మకొండ దళిత వాసులకు న్యాయం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా మేము రెవెన్యూ అధికారులను అడుగుతున్నాం అలా న్యాయం చేయన పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలోనే గ్రామస్తులను కలుపుకొని ఆ స్థలంలో భూ పోరాటం చేసి ఎర్రజెండాలు పాతి అక్కడే ఉండే దళితులకు భూమిని అప్పజెప్తామని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా రెవెన్యూ అధికారులకు హెచ్చరిక చేస్తున్నాం ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు మల్లికార్జున. పెద్దయ్య నాగరాజా. రాములమ్మ రాములమ్మ పెంచలమ్మ తదితరు గ్రామస్తులు పాల్గొన్నారు

# ఆతిథ్యానికి ఆభరణం... ఆత్మీయతకు ఆదర్శం

**ఎంత ఎదిగినా ఒదుగుతూ.. ఆత్మీయత పంచుతూ..**

**పదవంటే వినయ, విధేయతలే అలంకారమని చాటిన మంత్రి నారా లోకేష్ ఆత్మీయ విందు**

**ఆత్మీయ విందులో పాల్గొన్న మంత్రి సుభాష్ కుటుంబం**

**అమరావతి, జనసేన ప్రతినిధి, ఫిబ్రవరి 24:** నవ్యాంధ్రప్రదేశ్ రథసారధి, స్వర్ణాంధ్ర సృష్టికర్త, దేశ రాజకీయల్లో ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ కలిగిన సీఎం నారా చంద్రబాబు నాయుడు తనయుడు.. ఐటీ, విద్యాశాఖ, మానవ వనరుల శాఖ మంత్రి.. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వంటి స్థాయిలో ఉన్నా సరే.. మచ్చుకైనా ఎక్కడా గర్వం లేదు..హంగూ..ఆర్భాటము అసలే లేదు.. వయసులో చిన్నవాడైనా.. గొప్ప మనసున్న వాడు.. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండమనే పెద్దల మాటలను తూచా తప్పకుండా పాటించే మా అభిమాన నాయకుడు నారా లోకేష్ అంటూ రాష్ట్ర మంత్రులు.. ఎంపీలు.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారి కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేష్ అతిథి మర్యాదకు, ఆప్యాయతకు ఫిదా అయ్యారు. మంగళవారం రాత్రి ఉండవల్లి నివాసం వేదికగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు రాజకీయ వేదికలా కాకుండా ఒక కుటుంబ సమ్మేళనంగా, స్నేహ సౌహార్దాల సందడిగా అద్భుతంగా నిలిచింది.అతిథి దేవోభవ భావంతో స్వాగత విందుకు విచ్చేసిన ప్రతి అతిథిని వ్యక్తిగతంగా పలకరించి,హృదయపూర్వకంగా ఆహ్వానిస్తూ మంత్రి లోకేష్ చూపిన ఆతిథ్య గౌరవం అందరినీ ఆకట్టుకుంది. నాయకుడిగా కాకుండా .. ఇంటి పెద్దగా, కుటుంబ సభ్యుడిగా ఆతిథ్యాన్ని అందించడం ప్రత్యేకతగా నిలిచింది. అక్కడకు వచ్చిన చిన్నారులతో ముసి ముసి నవ్వులు ..చిలిపి క్షణాలు... చిరునవ్వుల జల్లులుతో తడిసి ముద్దయ్యారు. మంత్రి లోకేష్ చిన్నపిల్లలను ఎత్తుకుని ముద్దు చేస్తూ.. హై–ఫై ఇస్తూ, వారితో సరదాగా ముచ్చటిస్తూ గడిపిన క్షణాలు విందుకు వచ్చిన కుటుంబాలకు మరపురాని అనుభూతిని ఇచ్చాయి. మంత్రి లోకేష్ స్నేహసౌమ్య స్వభావం



ఆత్మీయ విందులో ఆనంద వాతావరణాన్ని నింపింది.మహిళల గౌరవార్థం మంగళగిరి చేనేత శాల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన చేనేత చీరలను కానుకగా ఇచ్చి, మహిళలను తోబుట్టువులుగా భావిస్తూ చేనేత పట్టు చీరలు అందజేయడం ద్వారా మహిళా గౌరవానికి ప్రతీకగా నిలిచారు. సంప్రదాయం, సంస్కృతి, సోదర భావం..ఈ మూడు విలువలను ఒకే కానుకలో ప్రతిబింబింపజేసిన తీరుకు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. పదవి ఉన్నతమైనా... మనసు మరింత వినయమని ప్రశంసించారు. అత్యంత కీలక శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ ఎలాంటి ఆడంబరాలు లేకుండా ప్రతి అతిథితో సాదాసీదాగా, సమానంగా మెలగడం అందరినీ ఆశ్చర్యపరిచింది. నాయకత్వంలో వినయం, వ్యవహారంలో మానవత్వం, వ్యక్తిత్వంలో ఆత్మీయత మంత్రి లోకేష్ తీరును ప్రముఖులు ప్రశంసించారు. ఆత్మీయ విందు ఆద్యాంతం రాజకీయ వేదికలా కాకుండా కుటుంబ వేడుకలా సాగి ఆత్మీయ విందు పరస్పర అనుబంధాలను మరింత బలపరిచింది. నాయకుడు అతిథి అనే దూరాన్ని తొలగించి కుటుంబ సభ్యుల మధ్య ఉన్న ఆప్యాయతను సృష్టించగలిగిన అరుదైన సందర్భమని విందులో పాల్గొన్నవారు పేర్కొన్నారు.



పదవులు వ్యక్తిని గొప్పవాడిని చేయవు... వ్యక్తిత్వమే పదవిని గొప్పదాన్ని చేస్తుంది అనే సత్యాన్ని తన ఆత్మీయ ఆతిథ్యంతో మంత్రి నారా లోకేష్ మరోసారి చాటిచెప్పారు.

మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబంతో మంత్రి లోకేష్

ఈ ఆత్మీయ విందులో మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు, ఇద్దరు పిల్లలు,మంత్రి తండ్రి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, పాల్గొన్నారు. మంత్రి లోకేష్ ను ఎంతగానో అభిమానించే మంత్రి సుభాష్, వారి కుటుంబ సభ్యులుతో మంత్రి లోకేష్ పలు విషయాలు ఆసక్తికరంగా అడిగి తెలుసుకున్నారు. మంత్రి సుభాష్ కవల పిల్లలు ఇద్దరితో మంత్రి లోకేష్ సమయం వెచ్చించి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ సీఎం చంద్రబాబు,మంత్రి లోకేష్, లోకేష్ తనయుడు దేవాన్ష్ చిత్రపటాన్ని బహుమతిగా అందచేయగా, వాసంశెట్టి సత్యం భగవద్గీతను బహుమతిగా అందించారు. అనంతరం రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాష్ వ్యక్తిగతంగా చేస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలు, అలాగే సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలు మంత్రి లోకేష్ తెలుసుకొని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆత్మీయ విందు కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాల పార్లమెంటు నియోజక వర్గాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కుటుంబాలతో సహా హాజరయ్యారు.

## రాష్ట్రాల ఆర్థిక ఇబ్బందులతో మురిగిపోనున్న కేంద్ర నిధులు

**కాకినాడ రూరల్, జనసేన ప్రతినిధి, ఫిబ్రవరి 24:** రాష్ట్రాల ఆదాయంలో అధిక శాతం నిధులు వడ్డీలు, ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, సబ్సిడీల కు సరిపోతుండడంతో రాష్ట్రాలలో అమలు చేసే కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ జతచేసే నిధులు లేక మురిగిపోయే పరిస్థితి నెలకొందని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన



మాట్లాడారు. రాష్ట్రాలలో అమలు చేసే దాదాపు 66 పథకాలకు కేంద్రం నుంచి నిధులు వస్తాయని అన్నారు. వాటికి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నిర్దేశించిన శాతాలలో కొంత నిధులు జతచేసి ఆయా పథకాలను కొనసాగించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడంలో ఒకవైపు కోతలు పెడుతుంటే మరోవైపు వచ్చిన కొద్దిపాటి నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక ఇబ్బందులతో మ్యాచింగ్ గ్రాంట్ జత చేయడానికి సతమతమవుతున్నాయి అని అన్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరం మార్చి 31 తో ముగిస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వాలు వాటికి మ్యాచింగ్ గ్రాండ్ జత చేసి ఖర్చు చేయకపోతే ఆయా నిధులు మురిగిపోనున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలోని కూటమి ప్రభుత్వం వివిధ పథకాలకు కేంద్రం ఇచ్చే నిధులు సకాలంలో ఖర్చు చేయాలంటూ ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని అడబాల తెలిపారు.

## భారత్-బల్గేరియా పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ సభ్యునిగా రాజ్యసభ సభ్యులుగా సానా సతీష్ బాబు

**కాకినాడ, జనసేన ప్రతినిధి, ఫిబ్రవరి 24:** 18వ లోక్‌సభ కాలానికి సంబంధించి భారత పార్లమెంట్‌లో బల్గేరియాతో పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ ఏర్పాటు చేయబడింది. రెండు దేశాల మధ్య పార్లమెంటరీ సంబంధాలను బలోపేతం చేయడం, పరస్పర అవగాహననుపెంపొందించడం,ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడం ఈ గ్రూప్ ప్రధాన ఉద్దేశ్యం.గౌరవ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గారు శ్రీ సానా సతీష్ బాబు గారిని భారత్--బల్గేరియా పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ సభ్యునిగా నామినేట్ చేశారు.ఈ నియామకం ద్వారా భారత్ మరియు బల్గేరియా దేశాల మధ్య పార్లమెంటరీ స్థాయిలో సత్సంబంధాలు మరింత బలపడనున్నాయి.



## పేదలకు అందని చట్టాలు-ఎఫ్ ఆర్టిఐ విస్తృతంగా అవగాహనకార్యక్రమాలు చేపట్టాలి : అన్వేష్

**త్వరలో అంబేద్కర్ డాక్యుమెంటరీ ప్రదర్శన**

**ఓ పాజిటివ్ కిడ్నీ దాతలు ముందుకు రావాలి**

**అమరావతి, జనసేన ప్రతినిధి, ఫిబ్రవరి 24:** దేశం లో పేదలకు చట్టాలు తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిబిజి డైరెక్టర్ పి. అన్వేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అమరావతి లోని ఫోరమ్ ఫర్ ఆర్టిఐ జాతీయ కార్యాలయానికి అన్వేష్ విచ్చేసారు.ఈ సందర్భంగా జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్ కు ఇటీవల



వచ్చిన జాతీయ అవార్డును అన్వేష్ అందజేశారు.ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసు కొన్నారు. ఓ పాజిటివ్ కిడ్నీ దాతలు ముందుకు రావాలి అని, ఎఫ్ ఆర్టిఐ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోని ప్రయత్నం చేయాలి అని కోరారు. అదేవిధంగా పేదలకు చట్టాలు అర్థవంతంగా తెలిసేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. భారత రాజ్యంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ గురించి గ్రామాలలో డాక్యుమెంటరీ ప్రదర్శించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో జాతీయ వ్యవస్థాపక నాయకులు ఉప్పిటి బాలరాజు, రాష్ట్ర మహిళా నాయకులు,సీనియర్ న్యాయవాది సంతోషి పాల్గొన్నారు.

## నేడు కళ్యాణ్ దుర్గం మార్కెట్ యార్డ్ నందు మామిడి పంటలు సాగు పద్ధతులు పురుగు రోగాల నియంత్రణ కార్యక్రమం....

**బెలుగుప్ప ( జనసేన ప్రతినిధి) ఫిబ్రవరి 24:** నేడు ఉదయం 10.30 గంటలకు, కళ్యాణదుర్గం మార్కెట్ యార్డ్ నందు, మామిడి పంటలో శాస్త్రీయ సాగు పద్ధతులు, పురుగు–రోగాల నియంత్రణ, పంట నిర్వహణ, మామిడి కవర్లపై అవగాహన, డ్రిప్ ఆటోమేషన్ మరియు మార్కెటింగ్ అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు మామిడి శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమానికి కళ్యాణదుర్గం డివిజన్ మామిడి రైతులు తప్పనిసరిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని విజయవంతం చేయవలసిందిగా కోరడం జరిగిందని ఉద్యాన అధికారి కృష్ణ తేజ తెలియజేశారు.





# కివీ పండు తొక్క తీసి పారేస్తున్నారా?

చాలామంది కివీ పండు అనగానే లోపల ఉండే పచ్చని గుజ్జును మాత్రమే ఇష్టంగా తింటారు. పైన ఉండే గోధుమ రంగు తొక్కను చూసి అసహ్యించుకుని పారేస్తుంటారు. కానీ, నిపుణులు చెబుతున్న దాని ప్రకారం.. కివీ తొక్కను పారేయడం అంటే సగానికి పైగా పోషకాలను వదులుకోవడమే! కివీ గుజ్జు కంటే దాని తొక్కలో 50 శాతం ఎక్కువ పీచు పదార్థం శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. విటమిన్ సి అధికంగా ఉండే పండల్లో కివి ముందు వరుసలో ఉంటుంది. అంతటి పోషకాలున్న ఈ పండు గుజ్జులోనే కాదు పై పొరలో కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయట. కివీ తొక్క తినడం వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలు ఏంటి? కివీ తొక్కలో ఉండే అధిక పీచు పదార్థం పేగుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది మలబద్ధకాన్ని వదిలించడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక బెస్ట్ ఆప్షన్.కివీ తొక్కలో విటమిన్ సి ఇ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి సహజమైన రక్షణ కవచంలా పనిచేస్తాయి. ఇందులోని యాంటీ మైక్రోబియల్ గుణాలు హానికర బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని కాపాడతాయి.వృద్ధాప్య ఛాయలను తగ్గించడంలో కివీ తొక్క అద్భుతంగా పనిచేస్తుంది. విటమిన్ ఇ చర్మం పొడిబారకుండా చూస్తుంది. కొంతమంది సహజ సౌందర్యం కోసం దీనిని ఫేస్ స్క్రబ్‌లలో కూడా ఉపయోగిస్తారు. ఇందులోని ఫ్లేవనాయిడ్స్ శరీరంలో వాపును తగ్గిస్తాయి. గుండె జబ్బులు, మధుమేహం క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గించడంలో కివీ తొక్క సహాయపడుతుంది. పండును పూర్తిగా తొక్కతో సహా తినడం వల్ల ఆహార వృధాను తగ్గించవచ్చు. ఇది పర్యావరణానికి మనం చేసే చిన్న సహాయం.

## వాటర్ హీటర్.. ఎక్కువగా వాడుతున్నారా?




గీజర్లకు బదులుగా సాధారణ వాటర్ హీటర్లతో నీటిని అతిగా వేడి చేసి స్నానం చేయడం చర్మ, ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అధిక వేడి చర్మంపై తేమ పొరను దెబ్బతీసి పొడిబారడం, దురద కలిగిస్తుంది. నాణ్యత లేని పరికరాలతో లోహ కణాలు నీటిలో చేరి అలర్జీలు రావచ్చు. ఇళ్లలో గీజర్‌కు బదులుగా సాధారణ వాటర్ హీటర్‌తో నీటిని వేడి చేసి స్నానం చేసే అలవాటు కొందరిలో పెరుగుతోంది. అయితే నీటిని అతిగా వేడి చేయడం లేదా పరికరాలను సరిగా ఉపయోగించకపోవడం వల్ల ఆరోగ్య, చర్మ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీరు చాలా ఎక్కువ ఉష్ణోగ్రతకు చేరితే చర్మంపై ఉన్న సహజ తేమ పొర దెబ్బతింటుంది. దీని వల్ల చర్మం పొడిబారడం, దురద, ఎర్రబారడం వంటి సమస్యలు కనిపించవచ్చు. ముఖ్యంగా సున్నితమైన చర్మం ఉన్నవారు, పిల్లలు, వృద్ధులు అధిక వేడి నీటితో స్నానం చేస్తే చర్మ రక్షణ పొర త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. కొన్నిసార్లు స్వల్ప కాలిన గాయాలు కూడా ఏర్పడవచ్చని వైద్యులు చెబుతున్నారు.ఇంకా ఒక ముఖ్యమైన అంశం నీటి నాణ్యత. కొంతమంది ఉపయోగించే ఇమర్షన్ రాడ్లు లేదా తక్కువ నాణ్యత గల వాటర్ హీటర్లు నీటిలో లోహ కణాలు లేదా మలినాలు కలిసే ప్రమాదాన్ని పెంచుతాయి. అటువంటి నీటితో తరచుగా స్నానం చేస్తే చర్మ అలర్జీలు, రాష్‌లు వచ్చే అవకాశాన్ని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే సరైన ఇన్సులేషన్ లేకుండా ఉన్న పరికరాలు విద్యుత్ షాక్ ప్రమాదాన్ని కూడా పెంచుతాయి. అయితే సరైన ఉష్ణోగ్రతలో, నాణ్యమైన పరికరంతో నీటిని వేడి చేసి ఉపయోగిస్తే పెద్ద ఆరోగ్య ప్రమాదాలు ఉండవని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. నీరు మితమైన వేడిగా సుమారు 37 నుంచి 40 డిగ్రీల మధ్య ఉండేలా చూసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. స్నానం తర్వాత మాయిశ్చరైజర్ వాడటం ద్వారా చర్మ పొడిబారడం తగ్గించుకోవచ్చు. మొత్తంగా గీజర్ కాని వాటర్ హీటర్ కాని పరికరం ఏదైనా సరే, నీటి ఉష్ణోగ్రత నియంత్రణ, పరికరం నాణ్యత, భద్రతా జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య సమస్యలను చాలా వరకు నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## కడుపులో గ్యాస్ సమస్యకు విరుగుడు!



ఉదయం వేళల్లో చాలా మందికి గ్యాస్ సమస్య ఉంటుంది. సాధారణం చాలా మంది ఈ సమస్యతో బాధపడుతున్నప్పటికీ పెద్దగా పట్టించుకోరు. కడుపులో గ్యాస్ నిరంతరం భారంగా అనిపించేలా చేస్తుంది. కొందరికి ఈ సమస్య రోజంతా ఉంటుంది. దీంతో ఈ సమస్య నయం చేయడానికి చాలా మంది మందులు తీసుకుంటారు. కానీ కొన్ని ఇంటి నివారణలను అనుసరించడం ద్వారా కూడా వెంటనే ఉపశమనం పొందవచ్చు. గోరువెచ్చని నీళ్లు- నిమ్మరసం: ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు 'మేల్కొలుపు' లాంటిది. ఇందులో సగం నిమ్మకాయ పిండి ఈ నీటిని తాగడం వల్ల శరీరం నుంచి విషాన్ని బయటకు పంపించవచ్చు. ఇది ఆమ్లతను తగ్గిస్తుంది. అల్లం టీ.. అల్లంలో జింజెరాల్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. ఒక చిన్న అల్లం ముక్కను నోట్లో వేసుకుని నమలవచ్చు లేదా నీటిలో మరిగించిన అల్లం టీ తాగవచ్చు. ఇది కడుపు కండరాలను సడలిస్తుంది. వాము - నల్ల ఉప్పు.. ఇది గ్యాస్ కు అత్యంత పురాతనమైన, అత్యంత ప్రభావవంతమైన నివారణ. వాములో ఉండే 'థైమోల్' జీర్ణ రసాలను సక్రియం చేస్తుంది. ఇందు కోసం అర టీస్పూన్ వాము, చిటికెడు ఉప్పును గోరువెచ్చని నీటితో కలిపి తాగాలి.జీలకర్ర నీళ్లు.. జీలకర్ర లాలాజల గ్రంథులను ఉత్తేజపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందు కోసం ఒక చెంచా జీలకర్రను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం మరిగించి, వడకట్టి టీ లాగా వేడిగా తాగాలి. ఇంగువ నీళ్లు.. గ్యాస్ కారణంగా కడుపు నొప్పితో బాధపడుతుంటే ఇలాంటి వారికి ఇంగువ దివ్యౌషధం. గోరువెచ్చని నీటిలో చిటికెడు ఇంగువ కలిపి తాగాలి లేదా ఇంగువ పేస్ట్ లా చేసి నాభి చుట్టూ అప్లై చేయాలి. ఇది చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది.

## కాళ్లు, చేతులు తిమ్మిర్లు పడుతున్నాయా?



చాలా మందికి తరచుగా చేతులు, కాళ్ళు తిమ్మిరిగా అనిపిస్తాయి. దీనిని సాధారణమైనదిగా భావించి విస్మరిస్తారు.. కానీ, అలా చేయడం తెలివైన పని కాదంటున్నారు వైద్య నిపుణులు.. ఎందుకంటే ఇది వివిధ కారణాల వల్ల సంభవించవచ్చు. ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోవడం, ఒక కాలు మీద నిలబడటం, చేతులను ఒకే స్థితిలో ఉంచినప్పుడు.. లేదా తప్పుడు స్థితిలో నిద్రపోవడం వల్ల తిమ్మిర్లు వస్తాయి.. చాలా మందికి తరచుగా చేతులు, కాళ్ళు తిమ్మిరిగా అనిపిస్తాయి. దీనిని సాధారణమైనదిగా భావించి విస్మరిస్తారు.. కానీ, అలా చేయడం తెలివైన పని కాదంటున్నారు వైద్య నిపుణులు.. ఎందుకంటే ఇది వివిధ కారణాల వల్ల సంభవించవచ్చు. ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోవడం, ఒక కాలు మీద నిలబడటం, చేతులను ఒకే స్థితిలో ఉంచినప్పుడు.. లేదా తప్పుడు స్థితిలో నిద్రపోవడం వల్ల తిమ్మిర్లు వస్తాయి.. ముఖ్యంగా నరాలపై ఒత్తిడి పెరగడం వల్ల తిమ్మిర్లు వస్తాయి. ఒకే పొజిషన్‌లో ఎక్కువసేపు ఉండటం వల్ల.. అది నాడులపై, రక్త ప్రసరణపై ఒత్తిడిని పెంచి చేతులు, కాళ్లు మొద్దు బారడం అంటే.. తిమ్మిరి పడతాయి.. అయితే.. మొబైల్ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌ను ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల కూడా నరాలపై ఒత్తిడి పెరుగుతుంది. విటమిన్ బి12 లోపం, మధుమేహం, థైరాయిడ్ సమస్యలు, రక్త ప్రసరణ సమస్యలు కూడా తిమ్మిరికి కారణమవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అదనంగా, మెడ లేదా వీపులోని నరాల సంపీడనం చేతులు ? కాళ్ళలో జలదరింపు, తిమ్మిరికి కారణమవుతుంది. కొన్నిసార్లు, ఒత్తిడి ? ఆందోళన కూడా నరాలను ప్రభావితం చేస్తాయి. ఈ సమస్య పదేపదే సంభవిస్తే లేదా ఎక్కువ కాలం కొనసాగితే, దానిని తేలికగా తీసుకోకూడదు. అందువల్ల, చేతులు ? కాళ్ళలో తిమ్మిరి ఎప్పుడు సాధారణమో.. అది నరాల సమస్యకు సంకేతంగా ఎప్పుడు ఉంటుందో అర్థం చేసుకోవడం ముఖ్యం. కొద్దిసేపు ఒత్తిడి కారణంగా చేతులు లేదా కాళ్ళు తిమ్మిరి చెంది, ఆ తర్వాత భంగిమ మార్చడంతో తగ్గిపోతే, అది సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. కూర్చోవడం, నిద్రపోవడం లేదా ఎక్కువసేపు తప్పు స్థితిలో ఉండటం వల్ల నరాల మీద తాత్కాలిక ఒత్తిడి ఏర్పడుతుంది.. ఇది జలదరింపుకు కారణమవుతుంది. అయితే, తిమ్మిరి ఎటువంటి స్పష్టమైన కారణం లేకుండా పదేపదే సంభవిస్తే, ఎక్కువసేపు కొనసాగితే, లేదా నొప్పి, మంట లేదా బలహీనతతో పాటు ఉంటే, అది నరాల సమస్యకు సంకేతం కావచ్చు.

మీరు నడుస్తున్నప్పుడు అస్థిరతను అనుభవిస్తే లేదా నిటారుగా నిలబడటానికి ఇబ్బందిగా అనిపిస్తే, దానిని విస్మరించకూడదు. మధుమేహం వల్ల నరాల దెబ్బతినడం వల్ల చేతులు ? కాళ్ళలో తిమ్మిరి వస్తుంది. వెన్నెముక నరాల కుదింపు కూడా ఈ పరిస్థితికి కారణమవుతుంది. మీరు శరీరంలోని ఒక భాగంలో అకస్మాత్తుగా తిమ్మిరిని అనుభవిస్తే, మాట్లాడటం లేదా నడవడంలో ఇబ్బందిగా ఉంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. నిరంతర ? తీవ్రమవుతున్న తిమ్మిరికి తీవ్రమైన కారణాలు ఉండవచ్చు. మధుమేహం వల్ల నరాల దెబ్బతినడం, తీవ్రమైన విటమిన్ బి12 లోపం, వెన్నెముక నరాల సంపీడనం ప్రమాదకరం కావచ్చు. ఆకస్మిక తిమ్మిరి, బలహీనత లేదా ముఖం ఒక వైపు వాలిపోవడం స్ట్రోక్‌ను సూచిస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తే తక్షణ మూల్యాంకనం, చికిత్స అవసరం. నిర్లక్ష్యం వల్ల పరిస్థితి మరింత దిగజారిపోతుంది.

# బిజినెస్

## వినియోగదారులకు ఊరట..
## భారీగా పడిపోయిన వెండి ధరలు



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఇవాళ ధరలు ఊహించని విధంగా పతనమయ్యాయి. ఒక్క రోజులోనే వెండి కేజీపై ఏకంగా రూ.15,000 తగ్గింది. ఇక బంగారం ధరలు మాత్రం స్వల్ప పెరుగుదలను నమోదు చేశాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.430 పెరిగి రూ.1,61,780కి చేరింది. ఇక ఆభరణాలలో వినియోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.400 మేర పెరిగి రూ.1,48,300 వద్ద కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా పెరుగుతూ వచ్చిన వెండి ధర ఇవాళ భారీగా దిగివచ్చింది. నిన్నటి ధరతో పోలిస్తే ఇప్పుడు కేజీ వెండి రూ.2,85,000 వద్ద పలుకుతోంది. వెండి ఆభరణాలు కొనేవారికి, పెట్టుబడిదారులకు ఇది పెద్ద ఊరట అని చెప్పవచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల ప్రభావం దేశీయ బులియన్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. పసిడి ప్రియులు కొనుగోలు చేసే ముందు తాజా ధరలను ఒకసారి సరిచూసుకోవడం మంచిదని బిజినెస్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్
## వ్యవహారంపై స్పందించిన ఆర్‌బీఐ




ప్రముఖ ప్రైవేటు రంగ ఐడీఎఫ్‌సీ బ్యాంకులో జరిగిన రూ. 590 కోట్ల భారీ మోసంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. యూనియన్ బడ్జెట్ తర్వాత సాంప్రదాయంగా ఆర్థిక మంత్రితో జరిగే సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో జరిగిన ఫ్రాడ్ వ్యవహారంపై, దాని చుట్టూ నెలకొన్న పరిణామాలను గమనిస్తున్నామని, ఇందులో ఎలాంటి వ్యవస్థాగత మోసం జరగలేదని మల్హోత్రా చెప్పారు. హర్యానా ప్రభుత్వానికి చెందిన ఖాతాల్లో బ్యాంకు ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం బహిర్గతం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన బ్యాంక్ ఎండీ, సీఈఓ వి.వైద్యనాథన్, బ్యాంకులోని లోపాలను సరిదిద్దడంతో పాటు బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో ఎవరికీ ఈ మోసంలో ప్రమేయం లేదని, సాధారణ బ్యాంకింగ్ లావాదేవీలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. హర్యానా ప్రభుత్వం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు తమ ఖాతాను బదిలీ చేయాలని కోరిన సమయంలో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న దానికి, బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో ఉన్న బ్యాలెన్స్‌కు మధ్య వ్యత్యాసం ద్వారా ఈ ఫ్రాడ్‌ను గుర్తించారు. చండీగఢ్‌లోని బ్రాంచ్‌లో కొందరు ఉద్యోగులు బయటి వ్యక్తులతో కలిసి ఈ మోసం చేసినట్టు తెలుస్తోంది.

# ఈపీఎఫ్ఓ శుభవార్త..
# 31 లక్షల మందికి బెనిఫిట్

ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సామాజిక భద్రతా పథకం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్. దీనిని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది పని చేస్తుంది. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొచ్చారు. త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్ఓ వీక్లీ రివ్యూ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాండవీయ సోమవారం వివరించారు. ప్రస్తుతానికి 31.86 లక్షల వరకు పీఎఫ్ ఖాతాలు.. నిర్వహణ లేవని (ఇనాపరేటివ్) ఈపీఎఫ్ఓ గుర్తించింది. దీంట్లో సుమారు రూ. 10,903 కోట్ల మేర నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తోంది. వీటిల్లో సుమారు 7.11 లక్షల ఖాతాల్లో రూ. 1000 వరకు మాత్రమే నగదు నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. వీటి విలువ మొత్తంగా రూ. 30.52




కోట్లుగా ఉన్నాయి. లేబర్ మినిస్ట్రీ ప్రకారం.. ఈ నిర్వహణలో లేని పీఎఫ్ ఖాతాల్లో 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి. దాదాపు మూడేళ్లుగా ఎలాంటి ట్రాన్సాక్షన్ నిర్వహించిన పీఎఫ్ అకౌంట్లను ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లుగా పేర్కొంటారు. ముందుగా ఇప్పుడు పైలట్ ప్రాతిపదికన ముందుగా 7 లక్షల ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేయనుంది ఈపీఎఫ్ఓ. ఇక్కడ ఆధార్‌తో అనుసంధానం అయి ఉన్న బ్యాంక్ అకౌంట్, ఈపీఎఫ్ఓ దగ్గర ఉన్నటువంటి వివరాల ఆధారంగా ఈ నగదు జమ చేయనుంది. ఇక్కడ చందాదారులు.. ఎలాంటి క్లెయిమ్ సెటిల్మెంట్ డాక్యుమెంట్స్ గానీ లేదా ఇతర డాక్యుమెంట్స్ గానీ ఇవ్వాల్సిన అవసరం లేదు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం అయితే.. అప్పుడు మిగతా 25 లక్షల మంది వరకు నిర్వహణలో లేని పీఎఫ్ చందాదారుల ఖాతాల్లోకి కూడా డబ్బును ఆటోమేటిక్‌గా రిఫండ్ చేసేందుకు ఈపీఎఫ్ఓ సన్నాహాలు చేస్తోంది.

# రూ.3 లక్షల కోట్ల ఎగుమతులకు సుంకం వర్తించదా?


ప్రతీకార సుంకాలను రద్దు చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా, వెనక్కి తగ్గని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల ఉత్పత్తులపై 15% సుంకం విధిస్తున్నానని, భారత్‌కూ ఇదే వర్తిస్తుందని తెలిపారు. వాణిజ్య చట్టం- 1974లోని సెక్షన్ 122 కింద ప్రతిపాదించిన టారిఫ్ చర్యల ప్రకారం.. 150 రోజుల వరకు 15% దాకా సుంకాలను అమెరికా అధ్యక్షుడు విధించొచ్చు. అయితే సుమారు 34 బి.డాలర్ల (సుమారు రూ.3 లక్షల కోట్ల)కు పైగా విలువైన భారత ఎగుమతులకు ఈ సుంకం నుంచి మినహాయింపు ఉంటుందని ఆంగ్ల పత్రికలు అంచనా వేశాయి. సుంకాల నుంచి మినహాయింపు ఉండే వాటిల్లో ఔషధాలు, ఎలక్ట్రానిక్స్‌తో పాటు పౌర విమానయాన రంగానికి సంబంధించినవి ఉండొచ్చని సమాచారం. ఇంతకుముందు జపాన్, ఐరోపా కూటమి, యునైటెడ్ కింగ్‌డమ్‌కు కూడా ఈ తరహా మినహాయింపులను అమెరికా పొడిగించింది. 2024లో అమెరికాకు మనదేశ మొత్తం ఎగుమతులు 87.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8 లక్షల కోట్లు)గా ఉన్నాయి. తాజా అమెరికా సుంకాల నుంచి మినహాయింపు ఉండే భారత ఎగుమతుల్లో.. ఔషధ రంగం ముందు వరసలో ఉండనుంది. ఈ రంగానికి సంబంధించి 10.6 బిలియన్ డాలర్ల (రూ.95,400 కోట్ల) విలువైన ఎగుమతులకు సుంకం వర్తించకపోవచ్చు. యాంటీబయోటిక్ ఫార్ములేషన్లు, హార్మోన్ల ఆధారిత ఔషధాలు, ఇమ్యునోలాజికల్ ఉత్పత్తుల వంటివి ఇందులో ఉంటాయి.



# అభిమానుల ప్రేమకు ప్రతీకగా కొత్త లోగో..
# గరుడ, కిరీటం, ఏనుగు బొమ్మలు ఎందుకంటే..?

ఐపీఎల్‌లో ప్రతిసారి గట్టి పోటీనిచ్చే లక్నో సూపర్ జెయింట్స్ వచ్చే సీజన్‌కు పక్కాగా సిద్ధమవుతోంది. ఇప్పటికే కోచింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకున్న లక్నో.. ఇకపై కొత్త లోగోతో మైదానంలోకి దిగనుంది. లావెండర్ రంగులో లక్నో పట్టణం చరిత్రను ప్రతిబింబించేలా గరుగ్మంతుడు, కిరీటం, ఏనుగు బొమ్మతో రూపొందించిన లోగో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇంతకూ ఈ లోగోలోని బొమ్మల వెనకున్న మతలబు ఏంటో తెలుసా..? లక్నో ఫ్రాంచైజీ కొత్త లోగో ఉత్తరప్రదేశ్.. లక్నో పట్టణ విశిష్టతను, స్ఫూర్తిగాథను చాటేలా సరికొత్తగా.. అభిమానులకు అమితంగా నచ్చేలా రూపొందించారు. తాజా లోగోలో శక్తివంతమైన గరుడు, కిరీటం, ఏనుగు బొమ్మలు ఉన్నాయి. గరుడ (గరుత్మంతుడు) చిహ్నం ధైర్యానికి ప్రతీక. సవాళ్లను స్వీకరించడం.. వెనక్కి తిరిగి చూడకపోవడం, ఉన్నత శిఖరాలకు చేరడాన్ని సూచిస్తుంది. లక్నో జట్టు అనుసరించే భయమన్నది ఎరుగని క్రికెట్‌ను, సమిష్టిగా ఆడితే అసాధ్యమైన లక్ష్యమంటూ ఉండదని చాటుతుంది.

కిరీటం విషయానికొస్తే దర్పం, బాధ్యతకు ప్రతీక. మైదానంలోకి దిగిన ప్రతిసారి లక్షలాదిమంది ఆశల్ని లక్నో జట్టు మోస్తుంది. లక్నో జెర్సీ ధరించడం ఎంతో గర్వకారణం. ప్రతిరోజు ఈ గౌరవాన్ని పొందాలని కిరీటం సూచిస్తుంది. కొత్త లోగుకు ఏనుగు బొమ్మ గుండెతో సమానం. బలం, తెలివి, ఓపిక, ఐక్యత.. ఈ లక్షణాలకు ప్రతిరూపమే ఏనుగు. ఫలితంతో సంబంధం లేకుండా సీజన్ సీజన్‌కు అభిమానుల నుంచి లభిస్తున్న నిరంతర మద్దతు, వారు చూపించే కృతజ్ఞతా భావానికి బొమ్మ ప్రతీక. క్లుప్తంగా చెప్పాలంటే లక్నో వీధులకు




సబంధించిన లోగో ఇది. ఇంట్లో ఉండి క్రికెట్ మ్యాచ్‌లు చూసే కుటుంబాలు, ఏదో ఒకరోజు లక్నో జెర్సీ వేసుకోవాలని ఆశపడే యువతకు ఇది ప్రతిబింబం. కొత్త లోగో.. ఈ ప్రాంత చరిత్ర, గౌరవం, ఐక్యత సందేశాన్ని చాటుతుంది.

ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఛైర్మన్, లక్నో ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గొయెంకా తమ కొత్త లోగోపై ఏమన్నారంటే.. 'ఈ కొత్త లోగో మా ఫ్రాంచైజీ భావోద్వేగానికి సంబంధించినది. మొదటి రోజు నుంచి ఉత్తరప్రదేశ్, లక్నో ప్రజలు లక్నో సూపర్ జెయింట్స్‌కు తమ హృదయాల్లో స్థానమిచ్చారు. అభిమానుల నమ్మకం, ప్రేమకు కృతజ్ఞతగా ఈ సింబల్‌ను రూపొందించాం. ఉన్నత స్థానానికి చేరాలనే మా కలకు గరుడ ప్రతీక. మైదానంలోకి దిగిన ప్రతిసారి గర్వపడే ప్రదర్శన చేయాలని కిరీటం సూచిస్తుంది. లక్నో ప్రాంత వైవిధ్యం, ధ్రుఢత్వానికి ఏనుగు సంకేతం. ఈ లోగోను మార్పుకోసమే తీసుకురాలేదు. ఇదొక ప్రామిస్. లక్నో సిటీని, ఇక్కడి మూలాలను మేము ఎంతగా గౌరవిస్తామో ఈ లోగో చెప్పకనే చెబుతుంది. ప్రతి పరుగు, వికెట్, మైదానంలోని ప్రతి క్షణం.. అభిమానుల ఎమోషన్స్‌ను చూపిస్తాయి. ఈ కొత్త లోగో ఇకపై లక్నో జట్టు జెర్సీపై, కిట్లపై, డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్‌లోనూ కనిపించనుంది. మా ఫ్రాంచైజీ అధికారిక ప్రచార సంస్థలు.. కొత్త లోగోతో కొనసాగుతాయి' అని సంజీవ్ వెల్లడించారు.

### వరుసగా 2 సార్లు ప్లే ఆఫ్స్

ఐపీఎల్‌లో 2022లో అరంగేట్రం చేసిన లక్నో సూపర్ జెయింట్స్ ట్రోఫీ కోసం నిరీక్షిస్తోంది. వరుసగా రెండుసీజన్లు ప్లే ఆఫ్ చేరిన ఎల్ఎస్‌జీ.. 17, 18వ సీజన్లలో నాకౌట్ దశకు ముందే టోర్నీ నుంచి నిష్క్రమించింది. పద్దెనిమిదో సీజన్ వేలంలో రూ. 27 కోట్ల రికార్డు ధరతో రిషభ్ పంత్‌ను కొనుగోలు చేసిన లక్నో.. ఆశించిన ఫలితాన్ని మాత్రం చూడలేదు. పంత్ సారథ్యంలోని ఆ జట్టు మొదట విజయాలతో అదరగొట్టింది. కానీ, చివరకు ఆరు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరలేదు. సో.. పంతొమ్మిదో సీజన్‌లో ట్రోఫీపై కన్నేసిన ఫ్రాంచైజీ కోచింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకుంది. కేన్ విలియమ్సన్‌కు వ్యూహాత్మక సలహాదారుగా, టామ్ మూడీకి 'గ్లోబల్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా కీలక బాధ్యతలు అప్పగించిన లక్నో.. స్పిన్ కోచ్‌గా కార్ల్ క్రొవేను తమ గూటికి తెచ్చుకుంది సంజీవ్ గొయెంకా టీమ్.

## తిలక్ తొందరపడకు..
## ఛేజ్‌మాస్టర్ అవ్వాలంటే కోహ్లీలా ఆడు..!




స్వదేశంలో ఫేవరెట్‌గా.. మూడో ప్రపంచకప్ వేటలో దూసుకెళ్తున్న భారత జట్టుకు దక్షిణాఫ్రికా బ్రేకులు వేసింది. ఆల్‌రౌండ్ షోతో టీమిండియాను ఓడించి.. సూర్యకుమార్ యాదవ్ సేన బలహీనతలను బట్టబయలు చేసింది. తుది జట్టులో మార్పులు, టాపార్డర్ వైఫల్యం ప్రధాన కారణాలు కాగా.. ఓ ఎండ్‌లో క్రీజులో పాతుకుపోయే వారే కరువవ్వడం విజయావకాశాల్ని ఘోరంగా దెబ్బతీసింది. వెస్టిండీస్ చేతిలో జింబాబ్వే చిత్తుగా ఓడిన వేళ.. భారత్ సెమీస్ అవకాశాలు మిణుకుమిణుకు మంటున్నాయి. ఈ పరిస్థితుల్లో యువ క్రికెటర్ తిలక్ వర్మకు మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ విలువైన సలహా ఇచ్చాడు. పొట్టి ప్రపంచకప్‌లో ఒకేఒక ఓటమి భారత్‌ను పునరాలోచనలో పడేసింది. జట్టు కూర్పు.. ఆటగాళ్ల ఫామ్‌ను బేరీజు వేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పకనే చెప్పింది. వరుసగా విఫలమవుతున్న ఓపెనర్ అభిషేక్ శర్మ, తిలక్ వర్మలపై వేటు వేసి.. సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. సూపర్ 8లో తొలి ఓవర్లోనే ఇషాన్ కిషన్ ఔట్ కావడంతో బాధ్యతగా ఆడాల్సిన తిలక్.. పొడగరి పేసర్ యాన్సెన్‌ను టార్గెట్ చేయబోయి వికెట్ కీపర్ చేతికి దొరికాడు. అనవసరంగా వికెట్ ఇచ్చేశాడని ఈ యంగ్‌స్టర్‌ను సునీల్ గవాస్కర్ గట్టిగానే విమర్శించాడు. ఇక మహమ్మద్ కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడుతూ.. తిలక్‌కు విలువైన సలహాలు ఇచ్చాడు. మూడో స్థానంలో విరాట్ కోహ్లీ మాదిరిగా ఇన్నింగ్స్ నిర్మించాలని యువ బ్యాటర్‌కు బోధించాడు. 'తిలక్ వర్మకు సొంత స్టయిల్ ఉంది. తక్కువ స్ట్రయిక్ రేటుతోనూ ఆడగలడు. కానీ, పెద్ద షాట్ ఆడే క్రమంలో ఔటవుతున్నాడు. స్ట్రయిక్ రేటు ఒత్తిడి అందుకు ఓ కారణం. ఆటగాడిగా కోచ్, కెప్టెన్ చెప్పిన పని చేయడం చాలా ముఖ్యం. అతడు విరాట్ కోహ్లీ పాత్రను పోషించాలి. కానీ,. సఫారీలతో మ్యాచ్‌లో తన బాధ్యతను మరిచి.. బిగ్ షాట్‌కు యత్నించాడు తిలక్.

# స్పోర్ట్స్

## 'వాళ్లేం మాల్కం మార్షల్ కాదు'..
## హార్దిక్, దూబేపై అక్తర్ సంచలన వ్యాఖ్యలు



టీ20 ప్రపంచకప్-2026లో టీమిండియా సెమీఫైనల్‌కు చేరుతుందా? లేదా? అన్న ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో భారత్ ఘోరంగా ఓడిపోవడంతో పరిస్థితి అంతా తారుమారైంది. గ్రూపు-1 పాయింట్ల పట్టికలో భారత్ మూడో స్థానంలో ఉంది. నెట్‌రన్ రేట్(-3.800) భారీగా పడిపోయింది. దీంతో భారత్ సెమీస్‌కు చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌లలో భారీ విజయాలతో పాటు, ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ భారత్ విఫలమైంది. 21 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన సఫారీలను భారత బౌలర్లు ఆపలేకపోయారు. మిడిల్ ఓవర్లలో భారీగా పరుగులు సమర్పించుకుంటూ ఓటమిలో తమ వంతు పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో భారత బౌలింగ్‌పై పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత వద్ద సరైన ఫాస్ట్ బౌలర్లు లేరని అక్తర్ అన్నాడు. అదేవిధంగా హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలు ఏమి మాల్కమ్ మార్షల్ వంటి బౌలర్లు కాదని అక్తర్ ఎద్దేవా చేశాడు. "సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో భారత బౌలింగ్ పూర్తిగా తేలిపోయింది. సాధారణంగా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 97 నుంచి 98 కి.మీ వేగంతో బౌలింగ్ చేస్తాడు. కానీ ఈ మ్యాచ్‌లో 94 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. అతడిని డెవాల్డ్ బ్రెవిస్ టార్గెట్ చేశాడు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలు 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తున్నారు. వారిద్దరూ ఏమి ప్రత్యర్థి బ్యాటర్లను భయపెట్టే మాల్కమ్ మార్షల్‌లు కారు. డెత్ ఓవర్లలో అటువంటి వారితో బౌలింగ్ చేస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రోటీస్‌తో మ్యాచ్‌లో అదే జరిగింది. ఈ మ్యాచ్‌లో పాండ్యా 45 పరుగులు సమర్పించుకున్నాడు" అని ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అక్తర్ పేర్కొన్నాడు.



# ఆ సంఘటన నన్ను ఎంతగానో గాయపరిచింది..

తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస విజయాలతో దూసుకుపోతుంది యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. బ్లాక్ బస్టర్ హిట్ 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో జరిగిన ఒక సంఘటన తనను ఎంతగా కలచివేసిందో ఆమె వివరించారు. 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో సెట్స్‌లో ఒక మేకపిల్ల ఉండేదని, దానితో తాను ఎంతో ఇష్టంగా ఆడుకునేదాన్ని అని అనుపమ తెలిపారు. "ఆ మేకపిల్లతో గడపడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చేది. అయితే ఒకరోజు షూటింగ్ గ్యాప్‌లో మాకు మటన్ బిర్యానీ వడ్డించారు. నేను తింటున్న సమయంలో నా అసిస్టెంట్ నా దగ్గరకు వచ్చి నవ్వుతూ.. 'మేడం, మీరు ఇప్పుడు తింటున్నది మీరు ఇందాక ఆడుకున్న మేకపిల్లనే' అని చెప్పాడు" అంటూ ఆనాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు. అసిస్టెంట్ చెప్పిన మాట వినగానే తాను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానని, వెంటనే వాంతులు చేసుకున్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తనను ఎంతగా గాయపరిచిందంటే.. అప్పటి నుంచి తాను మటన్ ముట్టుకోవడమే మానేశానని తెలిపారు. దాదాపు కార్తికేయ-2 సమయం నుంచి ఇప్పటి వరకు మటన్ జోలికి వెళ్ళలేదని, అయితే ఇటీవల కాలంలోనే మళ్ళీ నెమ్మదిగా తినడం ప్రారంభించానని ఆమె వెల్లడించారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వారంతా.. మూగజీవాల పట్ల ఆమెకు ఉన్న ప్రేమే ఆమెను అన్ని ఏళ్లపాటు మటన్‌కు దూరంగా ఉంచిందని, అనుపమ సున్నిత మనస్తత్వాన్ని మెచ్చుకుంటున్నారు. ఇక అనుపమ సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'లాక్‌డౌన్' సినిమాతో అలరించిన అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కళ్యాణం' అనే సినిమాలో నటిస్తున్నారు.



## అత్యంత తక్కువ టికెట్ ధరకు హే బల్‌వంత్

కొన్ని సంవత్సరాల వెనక్కి వెళ్లినట్లయితే తెలుగు సినిమా పరిశ్రమలో టికెట్ ధరలు కాస్త తక్కువగా ఉండేవి. అలాగే ఓటీటీల వెసులుబాటు కూడా లేదు.దానితో పెద్ద ఎత్తున ఫ్యామిలీ ఆడియన్స్, యూత్, కామన్ ప్రేక్షకులు కూడా సినిమాను థియేటర్కు వెళ్లి చూసేవారు. దానితో కాస్త మంచి సినిమాలకు సూపర్ వసూళ్లు దక్కడం, యావరేజ్ సినిమాలు కూడా బ్రేక్ ఈవెన్ ను కంప్లీట్ చేసుకునేవి. కానీ కొన్ని సంవత్సరాలుగా స్టార్ హీరోల సినిమాలకు టికెట్ ధరలను భారీగా పెంచుతున్నారు. అలాగే కొంచెం క్రేజ్ ఉన్న సినిమాల టికెట్ ధరలను కూడా అలాగే పెంచేస్తున్నారు. ఇక సినిమా విడుదల అయ్యి నెల తిరగకుండానే ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. దానితో చాలామంది ప్రేక్షకులు అంత డబ్బు పోసి సినిమాను థియేటర్కు వెళ్లి చూడాలా? నెల రోజుల్లోనే ఇంట్లో అంతా కలిసి చూడొచ్చు అనే అభిప్రాయానికి వచ్చేసారు. దానితో స్టార్ హీరోల సినిమాలకు బ్లాక్బస్టర్ టాక్ వచ్చిన సందర్భంలో, మరికొన్ని సినిమాలకు మాత్రమే పెద్ద ఎత్తున కలెక్షన్లు వస్తున్నాయి. చాలా చిత్రాలు బ్రేక్ ఈవెన్ కావడం కష్టంగా మారింది. దానితో చిన్న సినిమాల నిర్మాతలు కొత్త స్ట్రాటజీతో ముందుకు వస్తున్నారు. తమ సినిమాను అత్యంత తక్కువ టికెట్ ధరకు చూడండి అని ఆఫర్లు ఇస్తున్నారు. తాజాగా ఇదే ఫార్ములాను సుహాస్, శివానీ నాగారం జంటగా గోపి అచ్చర దర్శకత్వంలో రూపొందిన హే బల్‌వంత్ మూవీ యూనిట్ కూడా ఫాలో అయ్యింది. తాజాగా ఈ మూవీ బృందం వారు 99 రూపాయలకే రెండు తెలుగు రాష్ట్రాల్లోని మేజర్ స్క్రీన్లలో ఈ సినిమాను ప్రదర్శిస్తున్నట్లు, తక్కువ టికెట్ ధరకు ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి అని ఆఫర్ను ఇచ్చారు. మరి ఈ ఆఫర్ సినిమా వసూళ్లపై ఏ స్థాయి ప్రభావాన్ని చూపిస్తుందో చూడాలి.



# ఆ సమయంలో మళ్ళీ ఎవరినైనా నమ్ముతానని అనుకోలేదు..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. గత కొద్ది కాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఆమె 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.ఈ మూవీ పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో.. తాజాగా, ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా నాగచైతన్యతో విడాకుల తర్వాత తన పరిస్థితి ఎలా ఉండేదో, రాజ్ నిడిమోరు పరిచయం తనను ఎలా మార్చిందో ఆమె వివరించారు. "నేను విడాకులు తీసుకున్న సమయంలో చాలా కుంగిపోయాను. నా చుట్టూ ఒక గోడ కట్టుకుని ఎవరినీ రానివ్వలేదు. మళ్ళీ ఎవరినైనా నమ్ముతానని లేదా వేరొకరిపై ఆధారపడతానని అస్సలు ఊహించలేదు. కానీ, రాజ్ అందించిన ప్రేమను, స్నేహాన్ని స్వీకరించే మనస్తత్వం నాకు ఉండటం నా అదృష్టం. రాజ్ లాంటి వ్యక్తి నా జీవితంలో ఉండటం వల్ల నేను ఇప్పుడు ఒక మంచి మనిషిగా మారాను" అని సమంత ఎమోషనల్ అయ్యారు. తనలో వచ్చిన ఈ సానుకూల మార్పును అందరూ గమనిస్తున్నారని, తన పాత స్నేహితురాలు కూడా ఈ విషయాన్ని నేరుగా చెప్పారని సమంత పేర్కొన్నారు. విడిపోయిన ప్రారంభ రోజుల్లో చాలా లో-ఫేజ్‌లో ఉన్న తనకు, రాజ్‌తో ఏర్పడిన స్నేహం జీవితం పట్ల ఉన్న నమ్మకాన్ని మార్చేసిందని ఆమె వెల్లడించారు. 2021లో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' సెట్స్‌లో వీరిద్దరికీ పరిచయం ఏర్పడగా, అది కాలక్రమేణా బలపడి గతేడాది వివాహ బంధానికి దారితీసింది. పెళ్లి చేసుకుని వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట తమ పర్సనల్ లైఫ్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు.



# అన్నం పెట్టే ఇండస్ట్రీని గౌరవించండి

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగి, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ బిజీగా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని నటుల బాధ్యతలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.ఒక నటిగా తన వృత్తి పట్ల తనకు ఎంత గౌరవం ఉందో చెబుతూ, భాష తెలియకుండా నటించే వారిపై ఆమె పరోక్షంగా చురకలు వేశారు. చాలామంది నటీనటులు ఇతర భాషల్లో నటించేటప్పుడు డైలాగులకు బదులుగా కేవలం అంకెలు (1, 2, 3) లేదా 'అఆ' లు చెబుతూ మేనేజ్ చేస్తుంటారు. దీనిపై రకుల్ స్పందిస్తూ.. "నేను స్వతహాగా మోసగత్తెను కాదు. సెట్స్‌లో 1, 2, 3 లేదా అ ఆ అని చెప్పి నా లైన్లను నేను పూర్తి చేయలేను. ఒక పరిశ్రమ మనకు అన్నం పెడుతున్నప్పుడు మనం దాన్ని గౌరవించాలి. మనకు ఇంత ప్రేమను ఇస్తున్నప్పుడు.. కనీసం ఆ భాషను నేర్చుకోవడం మనం చేయాల్సిన కనీస బాధ్యత" అని ఆమె స్పష్టం చేశారు. తనకు ఎలాంటి పాత్రలు చేయాలని ఉందనే విషయంపై రకుల్ మాట్లాడుతూ.. "ఒక నటిగా నాకు విభిన్నమైన, ముఖ్యంగా నెగటివ్ రోల్స్ చేయడమంటే చాలా ఇష్టం. అది చాలా ఆకర్షణీయంగా అనిపిస్తుంది. అయితే ఇందులో ఒక సమస్య ఉంది. మీరు ఒకసారి నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపిస్తే, మేకర్స్ మిమ్మల్ని మళ్ళీ 'గర్ల్ నెక్స్ట్ డోర్' (పక్కింటి అమ్మాయి) పాత్రల్లో చూడటానికి ఇష్టపడరు" అని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక నటిగా పరిపూర్ణత కోసం తాను పడే తపనను వివరించిన రకుల్, భాష ఏదైనా సరే అందులో లీనమై నటించడమే తన విజయ రహస్యమని చెప్పుకొచ్చారు.

Printed, Published Owned by : Palika Venubabu # 3-68, Old Gaigolupadu, Ramanayyapeta, Kakinada Rural - 533005, East Godavari District, A.P.
Printed at : Jayabheri Offset Printers, # 3-68, Old Gaigolupadu Village, Ramanayyapeta, Kakinada Rural - 533005, East Godavari District, A.P.
RNI/APTEL/2014/59326. Editor : Palika Venubabu, Cell No. 79890 16571, Cheif Editor : G. Bujjibabu, Cell No. 86399 15657.